## వర్షంతో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

అకాల వర్షంతో పంటలు నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం అందించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు హెచ్చరించారు. శుక్రవారం ఆయన జిల్లా కలెక్టర్, నియోజకవర్గ వ్యవసాయ అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతూ అకాల వర్షంతో పంట నష్టంపై ప్రభుత్వానికి నివేదిక పంపాలన్నారు. రేవంత్‌రెడ్డి సర్కార్ రైతు బంధు ఇవ్వక..పంట నష్టపరిహారం ఇవ్వక రైతులను అగం చేస్తుందని వాపోయారు. గతంలో ముగ్గురు మంత్రులు వచ్చి దెబ్బతిన్న పంటలను పరిశీలించిన నేటీ వరకు ఒక్క రూపాయి పరిహారం అందించలేదన్నారు. 5 విడుతల్లో పంట నష్టపరిహారం ఇవ్వకుండా రైతులకు కాంగ్రెస్ సర్కార్ తీరని అన్యాయం చేస్తుందన్నారు. అకాలవర్షాలకు చేతికి వచ్చిన పంట నేల పాలైందని రైతులు ఆందోళన ఉన్నారని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. అకాల వర్షంతో మామిడి, పండ్ల తోటలు, వరి, మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తడిసిన ప్రతి గింజను కొనుగోలు చేయాలన్నారు. రైతులు ఆధైర్యపడొద్దని అండగా ఉంటానని తెలిపారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త



## చౌటకూరులో ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం

**చౌటకూరు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పంచాయితీ పాలకవర్గం ఘనంగా జరుపుకున్నారు. ఎంపిడిఓ కె.శంకర్ పంచాయితీ పాలక వర్గంతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ శంకర్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ కన్న కలలను నిజం చేయాల్సిన అవసరం ఉందని, పరిశుభ్రమైన, అభివృద్ధి చెందిన దేశంగా భారత దేశాన్ని చూడాలన్నదే మహాత్ముడు కలలు కన్నట్లు గుర్తు చేశారు. బహిరంగ మలవిసర్జనకుఉ అవకాశం లేకుండా ప్రతి ఒక్కరు మరుగుదొడ్లను నిర్మించుకోవాలన్నారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని, వృదా చేయవద్దని సూచించారు. వృదా నీటిని, వర్షపు నీటిని ఇంకుడు గుంతల్లోకి మళ్లించి భూగర్బ జలాలు పెరిగేలా ప్రజలు తమ వంతు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిఓ సువర్ణ, సర్పంచ్ పార్కుల రాంరెడ్డి, పంచాయితీ కార్యదర్శి సందీప్‌గౌడ్, మాజీ ఉప సర్పంచ్ రామాగౌడ్, వెటర్నరరీ అసిస్టెంట్ ప్రభాకర్, వార్డు సభ్యులు దప్పు అశోక్, చక్రపాణి, కాంగ్రెస్ గ్రామ కమిటి అధ్యక్షులు వర్కల రమేష్, ఎంపిడిఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



శంకర్‌గౌడ్‌కు నివాళులర్పిస్తున్న ఆర్టీసి కార్మికులు

## మూడో రోజూ కొనసాగిన ఆర్టీసి కార్మికుల సమ్మె

**డిపోల ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసనలు**

**డ్రైవర్ శంకర్‌గౌడ్‌కు ఘన నివాళులు**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలఅమలుకై ఆర్టీసి కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారంతో మూడో రోజుకు చేరుకుంది. దీంతో బస్సులు డిపోలకే పరిమితం అవుతున్నాయి. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఆయా డిపోల ఎదుట కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనలు చేపట్టారు. జిల్లాలోని సిద్దిపేట, హుస్నాబాద్, గజ్వేల్-ప్రజ్ఞాపూర్, దుబ్బాక డిపోల వద్ద ఆర్టీసి పోరాటంలో అశువులు బాసిన డ్రైవర్ శంకర్‌గౌడ్‌కు ఘనంగా నివాళులర్పించారు. సిద్దిపేటలో ఆర్టీసి కార్మికులు ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ నోటికి నల్ల గుడ్డ ధరించి నిరసన ర్యాలీ నిర్వహించారు. హైదారాబాద్ రోడ్డులోని డిపో నుంచి ప్రారంభమైన నిరసన ర్యాలీ పాత బస్టాండు అంబేద్కర్ సర్కిల్ వరకు సాగింది. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి కార్మికులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్టీసి జెఎసి నాయకులు నక్క మల్లేశం, టిఎస్‌గౌడ్, రవీందర్‌గౌడ్, కె.ఎం.రెడ్డి, శ్రీనివాస్, బాలయ్య, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు. జిల్లాలోని ఆయా డిపోల వద్ద సమ్మె సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## అక్రమ కట్టడాల తొలగింపు

**రెవెన్యూ అధికారుల కఠిన చర్యలు - కబ్జాదారులపై కేసులు నమోదు**



అక్రమ నిర్మాణాన్ని కూల్చేస్తున్న దృశ్యం

**అమీన్‌పూర్, ఏప్రిల్ 24: ప్రభాతవార్త :** ప్రభుత్వ భూములపై జరుగుతున్న అక్రమ ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల వెల్లువెత్తిన ఫిర్యాదుల నేపథ్యంలో అధికారులు రంగంలోకి దిగి, 993 సర్వే నంబర్‌కు చెందిన ప్రభుత్వ భూమిలో అనధికారంగా నిర్మాణాలు చేపడుతున్న కట్టడాలను జేసీబీ యంత్రాల సహాయంతో తొలగించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ప్రభుత్వ భూములను కబ్జా చేయడానికి ప్రయత్నించే వారిపై ఎలాంటి సహనం చూపబోమని స్పష్టం చేశారు. తరచూ గుర్తింపు చర్యలు చేపట్టి అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్నప్పటికీ, కొందరువ్యక్తులు నిబంధనలు పట్టించుకోకుండా యథేచ్ఛగా భూములను ఆక్రమిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, అవసరమైతే క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడటంలో ప్రజలు కూడా బాధ్యతగా వ్యవహరించి సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## మున్సిపల్ కోఆప్షన్ సభ్యుల ఎన్నికకు ముగిసిన నామినేషన్‌ల పర్వం

**జనరల్ 4, మైనార్టీ 2 నామినేషన్‌ల దాఖలు**



నామినేషన్ దాఖలు చేస్తున్న బొర్ర అనిల్ కుమార్

**రామాయంపేట, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** రామాయంపేట మున్సిపాలిటీలో కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక కోసం శుక్రవారం నామినేషన్‌ల ప్రక్రియ ముగిసింది. మొత్తం నాలుగు స్థానాలకుగాను 6 నామినేషన్‌లు దాఖలైనట్లు మున్సిపల్ మేనేజర్ రఘువరన్ తెలిపారు. కాగా 12 వార్డులున్న మున్సిపాలిటీకి 4 కోఆప్షన్ స్థానాలు ఉండగా, రెండు స్థానాలు మైనార్టీకి కేటాయించారు. అందులో ఒకటి మహిళకు కేటాయించారు. మరో రెండు స్థానాలకు గాను జనరల్ కేటగిరిలో ఒకటి మహిళకు కేటాయించారు. కాగా శుక్రవారం నాడు నామినేషన్ వేసినవారిలో దేమె యాదగిరి, బొర్ర అనిల్‌కుమార్, వి.పి. చంద్రప్రతాప్, మహ్మద్ గౌస్, చింతల రాధాభవాని, ఆసియా సుల్తానాలు నామినేషన్ దాఖలు చేశారు.

## ఆర్టీసీ సమ్మెతో తప్పని ఇబ్బందులు

**చిన్నశంకరంపేట, ఏప్రిల్ 24,ప్రభాతవార్త:** ఆర్టీసీ కార్మికులు సమస్యల పరిష్కారం కొరుతూ సమ్మె బాట పట్టడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం చిన్నశంకరంపేట నుంచి చేగుంట వెళ్లడానికి ప్రయాణికులు వేచి చూస్తుండగా ఒక ఆర్టీసి బస్సు వచ్చింది. బస్సు ఎక్కడానికి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతూ బస్సును ఎక్కారు. అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించి, బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



కిక్కిరిసిన ఆర్టీసి బస్సు

## చైర్మన్ గైర్హాజరుతో కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక వాయిదా

**జహీరాబాద్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** జహీరాబాద్ మున్సిపాలిటీలో కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక తీవ్ర ఉద్రిక్తత పరిస్థితికి దారితీసింది. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లతో పాటు కాంగ్రెస్ కౌన్సిలర్లు శుక్రవారం నిర్వహించాల్సి కో-ఆప్షన్ సభ్యుల ఎన్నికకు దూరంగా ఉండటంతో ఎన్నిక ప్రక్రీయ రసాబసాగా మారింది. ఈ నెల 24న కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక నిర్వాహణకు మున్సిపల్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లకు మున్సిపల్ అధికారులు సమాచారం అందించడంతో ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు మున్సిపల్ బిఆర్ఎస్, బిజెపి కౌన్సిలర్లతో కలిసి మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. ఎన్నికలకు కాంగ్రెస్ కౌన్సిలర్లు ఎవరూ రాకపోవడంతో ఎమ్మెల్యే మాణిక్‌రావు మున్సిపల్ కమిషనర్‌ను నిలదీస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్మన్ మహ్మద్ యూనుస్ అనారోగ్యంతో చికిత్స అందుకునేందుకు ఆసుపత్రిలో చేరినట్ల కమీషనర్ ఎమ్మెల్యేకు వివరించారు. చైర్మన్, పలువురు కౌన్సిలర్ల గైర్హాజరు కారణంగా సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు కమీషనర్ ప్రకటించి సమావేశం నుంచి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్‌రావు మాట్లాడుతూ ఓటమి భయంతోనే కాంగ్రెస్ కౌన్సిలర్లు సమావేశానికి హాజరుకాలేదన్నారు. అధికారులను అడ్డంపెట్టుకుని ఎన్నికలను అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్దమని విమర్శించారు. అధికారుల తీరుపై బిఆర్ఎస్ కౌన్సిలర్లు మండిపడుతూ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు బైఠాయించి ధర్నా చేపట్టారు.

**సమావేశంలో బైఠాయించిన ఎమ్మెల్యే, బిఆర్ఎస్, బిజెపి కౌన్సిలర్లు**



మున్సిపల్ కమిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు, బిఆర్ఎస్, బిజెపి కౌన్సిలర్లు

## మహిళా బిల్లును కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించడం సిగ్గుచేటు

**బిజెపి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

మహిళలు ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలలో ముందుండాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లును కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించడం సిగ్గుచేటని బిజెపి సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి మండిపడ్డారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఆమె మాట్లాడుతూ, దశాబ్దాల కాలం పాటు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ మహిళల సంక్షేమానికి ఏనాడు పాటుపడకపోగా రాజ్యసభలో మహిళా బిల్లు చేసి లోక్‌సభలో వీగిపోయేలా చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. సమయం వచ్చినప్పుడు మహిళలే కాంగ్రెస్ పార్టీని పాతరేస్తారని తెలిపారు. మహిళల అభివృద్ధికి ప్రధాని నరేంద్రమోడీ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు.370 ఆర్టికల్‌రద్దు, త్రిబుల్ తలాక్‌వంటి బిల్లులు అమలు చేసి దేశ అభ్యున్నతికి ప్రధాని నరేంద్రమోడీ కృషి చేస్తుంటే లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ మహిళా రిజర్వేషన్ బిల్లు ను అడ్డుకొని సంబరాలు చేసుకోవడం సిగ్గు చేటన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలేదన్నారు. బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్‌ముదిరాజ్, రాష్ట్ర నాయకులు కప్పర ప్రసాద్ తదితరులు మాట్లాడారు. సమావేశంలో నాయకులు బాసంగారి వెంకట్, ఉమ, పద్మ, వెంకటేశం, సంతోష్ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న గోదావరి అంజిరెడ్డి

## ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ మృతి బాధాకరం

**మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మదేవేందర్‌రెడ్డి**

**మెదక్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** ఆర్టీసీ డ్రైవర్ శంకర్‌గౌడ్ మృతిపట్ల మాజీ డిప్యూటీ స్పీకర్, బిఆర్ఎస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షురాలు పద్మ దేవేందర్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆత్మహత్యకు పాల్పడటం బాధాకరమని, మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలుసాధనకు వారు చేస్తున్న పోరాటం సమంజసమని, అయితే ఆ పోరాటంలో ప్రాణాలను కోల్పోవడం సరైంది కాదని చెప్పారు. పోరాటం చేయాలి.. గెలవాలి.. కానీ తప్పుడు నిర్ణయం మొత్తం కుటుంబాన్ని చీకటిలోకి నెడుతుంది. మీరే మీ కుటుంబానికి ధైర్యం, మీరే వారి బలం” అని పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికులారా ధైర్యంగా ఉండాలని, ఎలాంటి ఆత్మహత్యల వంటి అతి నిర్ణయాలకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేశారు. సమస్యలు ఎంత పెద్దవైనా, వాటికి పరిష్కారం ప్రాణాలు తీసుకోవడంకాదని, ధైర్యంగా నిలబడి పోరాడితేనే న్యాయం సాధ్యమవుతుందని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి, ఎన్నికల సమయంలో ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను సానుకూలంగా పరిశీలించి, తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి. కలిసి పోరాడదాం.. న్యాయమైన హక్కులను సాధించుకుందాం. కార్మికుల సంక్షేమం కోసం బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటుంది” అని పునరుద్ఘాటించారు.శంకర్ గౌడ్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు.

## పౌష్టికాహారం తీసుకోవాలి : సర్పంచ్

**చిన్నశంకరంపేట, ఏప్రిల్ 24,ప్రభాతవార్త:** గర్భిణిలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం కోసం పౌష్టికాహారం చాలా ముఖ్యమని కామారం తండా సర్పంచి మోహన్ నాయక్ అన్నారు. శుక్రవారం మండల పరిధి కామారం తండాలో పోషన్ పక్వాడ కార్యక్రమం నిర్వహించగా సర్పంచి మోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి స్వర్ణలత, ఉప సర్పంచి విజయ, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణా శిబిరంలో పాల్గొన్న వార్డు సభ్యులు

## ముగిసిన వార్డు సభ్యులకు శిక్షణ

**చిన్నశంకరంపేట, ఏప్రిల్ 24,ప్రభాతవార్త:** మండలంలో వార్డు సభ్యులకు నిర్వహించిన శిక్షణా శిబిరం శుక్రవారం ముగిసింది. పదిరోజుల పాటు వార్డు సభ్యులకు శిక్షణా తరగతులు కొనసాగాయి. చివరి రోజు శిక్షణా శిబిరంలో డీపీవో యాదయ్య పాల్గొని మాట్లాడుతూ గ్రామీణాబివృద్ధి, పారదర్శక పరిపాలన, పంచాయతీరాజ్ వ్యవస్థలో వార్డు సభ్యుల పాత్రపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ఈ శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేసిందన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించడం, నిధుల వినియోగం, ప్రజా సమస్యల పరిష్కారం, పారిశుధ్య చర్యలు, సంక్షేమ పథకాల అమలు అంశాలపై వివరించినట్లు వారు తెలిపారు. అనంతరం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం పురస్కరించుకోని కేక్ కట్ చేశారు.

## అంబేద్కర్ జాతీయ అవార్డుకు రామచంద్రం ఎంపిక

**చిన్నశంకరంపేట, ఏప్రిల్ 24,ప్రభాతవార్త:** చిన్నశంకరంపేట మండలం కొర్విపల్లి గ్రామానికి చెందిన అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్తిగల రామచంద్రం అంబేద్కర్ జాతీయ అవార్డుకు ఎంపికైనట్లు డాక్టర్ లయన్ స్ఫూర్తి ఇండియన్ స్వచ్ఛంధ సంస్థ అధ్యక్షుడు రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జన్ 15వ తేది భాగ్యనగరంలోని సరస్వతి ఆడిటోరియంలో అవార్డును అందిచనున్నట్లు ఆయన తెలిపారు. అవార్డు రావడం పట్ల రామచంద్రం సంతోషం వ్యక్తం చేశారు.

## నైపుణ్యాభివృద్ధితోనే భవిష్యత్ విజయం

**అడిషనల్ కలెక్టర్ పాండు**

**సంగారెడ్డి మున్సిపాలిటీ, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పాండు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి జీవితంలో ముందుగా లక్ష్యాన్ని స్పష్టంగా నిర్ణయించుకోవడం అత్యంత కీలకమన్నారు. ఏం కావాలనుకుంటున్నారు? ఏ రంగంలో రాణించాలనుకుంటున్నారు? అనే ప్రశ్నలకు సమాధానం తెలుసుకుని, ఆ దిశగా క్రమశిక్షణతో పయనిస్తే విజయాన్ని అందుకోవడం సులభమవుతుందని సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో కేవలం పాఠ్యపుస్తకాల జ్ఞానం సరిపోదని, నైపుణ్యాల అభివృద్ధి ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్, టెక్నికల్ నైపుణ్యాలు, సమస్యలను పరిష్కరించే సామర్థ్యంవంటి అంశాలు విద్యార్థులను మరింత ముందుకు తీసుకెళ్తాయని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ తరహా శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని, భవిష్యత్తుకు బాటలు విద్యార్థులను ప్రోత్సహించారు. విజయం ఒక్క రోజులో సాధ్యంకాదని, నిరంతర శ్రమ, పట్టుదల, క్రమశిక్షణ ఉంటే ఏ లక్ష్యాన్నైనా చేరుకోవచ్చని ఆయన స్పష్టం చేశారు. వైఫల్యాలకు భయపడకుండా వాటిని పాఠాలుగా తీసుకుని మరింత ధైర్యంగా ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. అలాగే, సామాజిక నేపథ్యాన్ని అడ్డంకిగా కాకుండా, అవకాశంగా మలుచుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, శిక్షణ కార్యక్రమాలు అందరికీ అందుబాటులో ఉన్నాయని,వాటిని సద్వినియోగం చేసుకోవడమే విజయానికి మొదటి అడుగని అన్నారు. ఈ కార్యక్రమంలో డీడీ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ అచలేష్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడి రామాచారి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి జగదీష్, డైరెక్టర్ రాజేశ్‌కుమార్, ట్రైనర్ అరవింద, స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనర్ కె.కృష్ణకుమార్, మోటివేటర్ కూన వేణు, రాజురాథోడ్ తదితరులు పాల్గొని విద్యార్థులకు నైపుణ్య శిక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమం లో బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టళ్ల లోని డిగ్రీ విద్యార్థులు, వివిధ సంక్షేమ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అడిషనల్ డాక్టర్ పాండు



ఘణపూర్ పంప్ హౌస్‌లోకి వచ్చి చేరుతున్న గోదావరి జలాలు

## ఘణపూర్ పంప్ హౌస్ ట్రయిల్ రన్ విజయవంతం

## 4 వేల ఎకరాలకు అందనున్న సాగునీరు

**హర్షం వ్యక్తం చేసిన హరీష్‌రావు**

**నంగునూర్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఘణపూర్ వద్ద నిర్మించిన ఘణపూర్ పంప్ హౌస్ వద్ద శుక్రవారం అధికారులు ట్రయిల్ నిర్వహించారు. ఘణపూర్ పంపుహౌస్ ట్రయిల్ రన్ విజయవంతం కావడంతో సమీప గ్రామాల ప్రజల సాగునీటి కల నెరవేరింది. ఘణపూర్ పంపు హౌస్ ద్వారా 4 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనుంది. 4 గ్రామాలు, 13 చెరువలకు సాగునీరు అందుతుంది. ఘణపూర్ పంప్ హౌస్ ట్రయిల్ రన్ విజయవంతం కావడంతో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు సంతోషం వ్యక్తం చేసి మాట్లాడారు. ఘణపూర్ పంపు హౌస్ నిర్మాణంలో భూ సేకరణకు సహకరించిన త్యాగధనులకు పాదాభివందనాలు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన రంగనాయకసాగర్ కుడి కాలువ ద్వారా పెద్ద వాగుకు చేరే నీటిని ఘణపూర్ పంప్ హౌస్‌లోకు 24 మీటర్ల ఎత్తు నుంచి లిఫ్ట్ చేస్తామని ఈ పంప్ హౌస్ నుంచి 24 మీటర్ల ఎత్తు నుంచి కెనాల్‌కు నీటిని పంప్‌చేసి కెనాల్‌ద్వారా వాగు అవతలి గ్రామాలకు సాగునీరు అందనుందన్నారు. ఇలాంటి గొప్ప కల సాకారం కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ పంప్‌హౌస్ కెనాల్ ద్వారా ఘణపూర్, అక్కనపల్లి, గట్లమల్యాల, ఖాతా గ్రామాలలో 4142 ఎకరాల ఆయకట్టుకు, ఘణపూర్‌లో 4 చెరువులు, అక్కనపల్లిలో 4 చెరువులు, గట్లమల్యాలలో 5 చెరువులకు నీరు రానుందన్నారు.

## మెదక్ జిల్లాలో ఆర్టీసీ సమ్మె ఉధృతం

**కోల శంకర్ గౌడ్ మృతికి నిరసనగా మౌన ప్రదర్శన**

**ప్రభుత్వ మొండివైఖరిపై ప్రజా సంఘాల ఆగ్రహం**

**మెదక్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** మెదక్ జిల్లాలో ఆర్టీసీ కార్మికుల సమ్మె మూడో రోజుకు చేరుకుంది. కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం సాగుతున్న ఈ పోరాటం జిల్లావ్యాప్తంగా ఉధృత రూపం దాల్చుతోంది. ఇందులో భాగంగా వరంగల్ జిల్లా నర్సంపేట బస్టాండ్ వద్ద ఆత్మబలిదానం చేసుకున్న ఆర్టీసీ డ్రైవర్ కోల శంకర్ గౌడ్ మృతి పట్ల స్థానిక కార్మికులు తీవ్ర దిగ్భ్రాంతిని, నిరసనను వ్యక్తం చేశారు. మెదక్ బస్టాండ్ వద్ద శంకర్‌గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి కార్మికులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా మెదక్ గుల్షన్ క్లబ్ నుండి రాందాస్ చౌరస్తా వరకు నల్ల బ్యాడ్జీలు ధరించి భారీ మౌన ప్రదర్శన నిర్వహించారు. తమ సహోద్యోగి మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఈ సందర్భంగా కార్మికులు నినదించారు. ఈ ఆందోళన కార్యక్రమానికి రాజకీయ పార్టీలు, వివిధ ప్రజా సంఘాల నుండి భారీ మద్దతు లభించింది. బీఆర్ఎస్ పార్టీ, తెలంగాణ రాజ్యాధికార పార్టీ, సీఐటీయూ నాయకులు సమ్మె శిబిరాన్ని సందర్శించి కార్మికులకు సంఘీభావం ప్రకటించారు. శంకర్ గౌడ్ మృతికి రాష్ట్ర ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యమే పూర్తి బాధ్యత వహించాలని మెదక్ మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లిఖార్జున్ గౌడ్ డిమాండ్ చేశారు. శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా సమ్మె చేస్తున్న కార్మికులను ప్రభుత్వం అణచివేయాలని చూడటం దుర్మార్గమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన మొండివైఖరిని వీడి, కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు.



శంకర్‌గౌడ్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న కార్మికులు

## విద్యుదాఘాతంతో రైతు మృతి

**నర్సాపూర్ రూరల్, ఏప్రిల్ 24 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని లింగాపూర్ గ్రామంలోని లాలుతండాలో శుక్రవారం విద్యుదాఘాతంతో రైతు మృతి చెందాడు. ఎస్సై రంజిత్ కుమార్ కథనం ప్రకారం.. లాలు తండాకు చెందిన దేవసోత్ శంకర్(41) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శుక్రవారం బర్రెలను మేపడానికి సమీపంలోని పొలానికి తీసుకెళ్లాడు. ఈ క్రమంలో రైతు పాండు పొలంలో బోరు మోటర్ కోసం వేసిన సర్వీస్ వైరు కిందకు వేలాడుతూ కనిపించింది. ఆ వైరు పశువులకు, మనుషులకు ప్రమాదకరమని భావించిన శంకర్ దానిని పక్కకు తొలగించేందుకు ప్రయత్నించాడు. అయితే వైరులైవ్‌లో ఉండటంతో అతను విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే కుప్పకూలాడు. సమీపంలో ఉన్న రెడ్యా అనే వ్యక్తి గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. వెంటనే శంకర్‌ను నర్సాపూర్ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య చంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడు శంకర్‌కు భార్యతో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## ఉరేసుకుని విద్యార్థిని ఆత్మహత్య...

**పాపన్నపేట, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** పరీక్షల్లో ఫెయిల్ అవుతానని భయంతో ఉరేసుకుని పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని పొడ్చన్‌పల్లి తండాలో జరిగింది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం... తండాకు చెందిన బానోత్ సాయిప్రియ(17) కొత్తపల్లి ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలు రాసింది. పరీక్షలు రాసిన నాటి నుంచి ఇంట్లో దిగులుగా ఉంటుంది. దిగులుగా ఉంటున్నావని తల్లి లత అడగగా పరీక్షలు సరిగా రాయలేదని ఫెయిల్ అవుతానని భయం వేస్తుంది అని చెప్పింది. ఫెయిల్ అయినా ఏమీకాదని ధైర్యంగా ఉండమని తల్లి ధైర్యం చెప్పింది. శుక్రవారం తల్లి లత గ్రామ శివారులో ఆరబోసిన వడ్ల కుప్పల వద్దకు వెళ్లింది. ఈ క్రమంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న సాయిప్రియ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కాసేపటికి అన్నం తీసుకురావడానికి వచ్చిన సోదరుడు గమనించి తల్లికి, చుట్టూపక్కల వారికి సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయ వార్షికోత్సవాలు



కన్యకాపరమేశ్వరి అమ్మవారి ప్రతిష్ఠచేసిన విగ్రహం దృశ్యం

**నర్సాపూర్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**
నర్సాపూర్ ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీకన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవాలు ఈనెల 25,26 తేదీల్లో రెండురోజులపాటు వారికోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఇమ్మడి శ్రీనివాస్‌గుప్త, ప్రధాన కార్యదర్శి జొన్నవాడ మల్లేశం గుప్తాలు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రెండురోజులపాటు అమ్మవారికి ప్రత్యేకపూజలతోపాటు అన్నప్రసాదవితరణ నిర్వహిస్తామని తెలిపారు. అమ్మవారిసన్నిధిలో జరిగే ప్రతి పూజాకార్యక్రమంలో భక్తులందరూ పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించి అమ్మవారికృపకు పాత్రులు కాగలరని కోరారు. అంతేగాక శ్రీకన్యకాపరమేశ్వరి వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఇమ్మడి శ్రీనివాస్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి మల్లేశం గుప్తలు కోరారు.

## ప్రభుత్వ పాఠశాలలే సరైన వేదికలు
**-ఎంఈఓ ఎన్.శంకర్**



ప్రభుత్వపాఠశాల విద్యపై అవగాహన కార్యక్రమంలో అధ్యాపకులు

**సదాశివపేట, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**
విద్యార్థుల భవిష్యత్తు బలంగా ఉండాలంటే ప్రభుత్వ పాఠశాలలే సరైన వేదిక అని మండలవిద్యాధికారి ఎన్.శంకర్ తెలిపారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలలోనే చేర్పించాలని, నాణ్యమైనవిద్య, సమగ్ర అభివృద్ధి ప్రభుత్వ పాఠశాలల ద్వారానే సాధ్యమని ఆయన పేర్కొన్నారు. గురువారం నిర్వహించిన ముందస్తు బడిబాట కార్యక్రమంలో భాగంగా ఏటిగడ్డ సంఘం గ్రామంలో ఇంటింటిప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచి శంభుప్రసాద్, వార్డుసభ్యులు, మాజీ వార్డుమెంబర్ గోపాల్, గ్రామపెద్దలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం



ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభించిన సర్పంచి

**నార్సింగి, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**
కాంగ్రెస్‌ప్రభుత్వం అమలుచేస్తున్న ఇందిరమ్మ ఇళ్లపథకం పేదల సొంతింటి కలలను సాకారంచేస్తోందని సర్పంచి నర్సింలు అన్నారు. నార్సింగి మండలం కాస్లాపూర్ గ్రామంలో లబ్దిదారుల కొత్తగా నిర్మించిన యేషబోయిన సంతోష గృహాన్ని శివనూర్ సర్పంచి నర్సింలు శుక్రవారం ప్రారంభించారు. అనంతరం వారి కుటుంబసభ్యులకి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజు, శివనూర్, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు చందుయాదవ్, వార్డుమెంబర్లు, నార్సింగి ఉపసర్పంచి యెన్నం రాజేందర్‌రెడ్డి, వార్డుమెంబర్లు బాచి స్వామి, ఆకుల నరేష్, కాంగ్రెస్ నాయకులు అంచనూరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి పనులను పరిశీలించిన ఎంపిడిఓ



ఉపాధిహామీ పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఓ చంద్రశేఖర్

**అల్లాదుర్గం, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని సీతానగర్‌లో కొనసాగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీపనులను శుక్రవారం ఎంపిడిఓ చంద్రశేఖర్ పరిశీలించారు. 70మంది ఉపాధిహామీ కూలీలు పనిచేస్తున్నట్లు గమనించిన ఎంపిడిఓ కూలీలకు పలు సూచనలుచేశారు. ఎండలోపనులుచేస్తున్న కూలీలకు మంచినీరు, ఓఆర్ఎస్ అందిచేసినట్లు ఎంపిడిఓ వివరించారు. కార్యక్రమంలో సీతానగర్ సాయి కుమార్, టిఎ మెట్ సాయిలు పంచాయతీ కార్యదర్శి అనిత, నాయకులు పవన్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి మండలస్థాయి శిక్షణాతరగతులు ప్రారంభం
**-శిక్షణా తరగతులకు హాజరైన రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి**

**జహీరాబాద్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**
నియోజకవర్గంలోని ఆయా మండలాలకు సంబంధించిన పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్ 2026 పేరుతో బిజెపి పట్టణంలోని జాగృతి డిగ్రీ కళాశాలలో శిక్షణతరగతులు ప్రారంభం అయ్యాయి. శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రత్యేక ఆహ్వానితులుగా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విజయమోహన్‌రెడ్డిలు హాజరై పార్టీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించారు. పార్టీ సిద్ధాంతాలు, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, బూత్ స్థాయిలో పార్టీ బలోపేతం కొరకు, ప్రపంచంలో భారత పాత్ర ఏకత్వ మానవ దర్శనం, సోషల్ మీడియా వినియోగం లాంటి అంశాలపై పార్టీ శ్రేణులకు వివరించారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ చివరిస్థాయి ప్రజలకు సంక్షేమపథకాలు అందిస్తున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు రాజశేఖర్‌రెడ్డి, నౌబాద్ జగన్నాథ్, జిల్లా ఉపాధ్యక్షులు గొల్ల భాస్కర్, నాయకులు సుభాష్‌రెడ్డి, శ్రీనివాస్‌గుప్తా, సుదీర్ బండారి, కిష్టన్న, ఆయామండలాల అధ్యక్షులు వైద్యనాథ్, మల్లేష్, బంటు విశ్వనాథ్, ఎంజి దుర్గయ్య, నెలవలం జగన్, జగన్నాథ్ హిందూస్, శంకర్‌రెడ్డి, అరుందతి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రం

**కొండాపూర్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**
కొండాపూర్ మండలపరిధిలోని మునిదేవపల్లి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈకార్యక్రమాన్ని గ్రామ సర్పంచి కృష్ణ ప్రారంభించారు. వేసవికాలంలో పెరుగుతున్న ఎండలతీవ్రతను దృష్టిలోపెట్టుకొని గ్రామప్రజలకు, పాదచారులకు తాగునీటి సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు సర్పంచి కృష్ణ తెలిపారు. కార్యక్రమంలో వార్డ్‌మెంబర్లు రామకృష్ణ, వెంకట్, మల్లేశం, నాగరాజు, గ్రామపెద్దలు, యువకులు, స్థానికప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. గ్రామప్రజలు ఈ చలివేంద్రం ఏర్పాటు పట్ల ఆనందం వ్యక్తంచేస్తూ గ్రామపంచాయతీకి కృతజ్ఞతలు తెలిపారు.

# గ్రామపంచాయతీ ఆవరణలో వాగ్వాదం

**నార్సింగి, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**
నార్సింగి మండలకేంద్రంలో ప్రజాసేవ చేయాల్సిన గ్రామ పంచాయతీ కార్యాలయ సిబ్బందిపై అవినీతి ఆరోపణలు ఆగడంలేదు. ఇటీవల పన్నుల వసూళ్లపై ఆన్లైన్‌లో ఒకలా ఉంటే ఆఫీసులో ఒకలా వసూలు చేస్తున్నారని ఆరోపణలురాగా, గ్రామ పంచాయతీనుంచి ఒకరిని విధులనుంచి తొలగించారు. ఆవిషయం మరువకముందే మళ్ళీ ఆరోపణలు రావడంతో ప్రజలు చర్చించుకుంటున్నారు. జాతీయ పంచాయతీ దినోత్సవం సందర్భంగా గ్రామసభ నిర్వహించారు. ఈసభలో గందరగోళ పరిస్థితి నెలకొంది. పంచాయతీ కార్యాలయం నుంచి వ్యాపార లైసెన్స్ రెన్యువల్ కోసం పట్టణ కేంద్రానికి చెందిన సంతోష్ కార్యాలయానికి వచ్చాడు. అందుకు కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహించే వ్యక్తిని సంప్రతించగా కార్యాలయంలో దరఖాస్తులు తీసుకోవడంలేదని బయట మీసేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. అందుకు సంతోష్, బయట దరఖాస్తుచేయడం ఎందుకు మీరేచేయండని అనగా, రెండువందలు రూపాయలు అదనంగా ఇస్తే చేస్తానని కంప్యూటర్ ఆపరేటర్ అన్నారు. రెండువందలు అదనంగా ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించగా, ఇద్దరిమధ్య వాగ్వివాదం జరిగింది. దీంతో ఈఓ నాగభూషణం గొడవ విషయమై వాకబుచేయగా, కంప్యూటర్ ఆపరేటర్ అదనంగా డబ్బులు అడుగుతున్నారని సంతోష్ ఫిర్యాదుచేశారు. ఈఓ ఇద్దరినీ సముదాయించి అదనంగా ఇవ్వాల్సిన అవసరంలేదని చెప్పగా సంతోష్ మద్యంతాగి వచ్చి గొడవ పడుతున్నాడని ఆపరేటర్ ఆరోపించాడు. తాను మద్యం తాగలేదని అనవసర ఆరోపణలు చేస్తున్నారని అనగా ఈఓ నాగభూషణం సర్దిచెప్పి పంపివేశారు. శుక్రవారం గ్రామసభ జరుగుతుండగా ఆపరేటర్ డబ్బులు అదనంగా అడిగిన విషయమై సంతోష్ ప్రశ్నించాడు. ఆపరేటర్, సంతోష్‌ల మధ్య మళ్ళీ వివాదం మొదలయ్యింది. సర్పంచి ఆకుల సుజాత, ఉపసర్పంచి రాజేందర్‌రెడ్డి పాలకవర్గం సభ్యులు కలుగజేసుకుని పన్నుల వసూలు విషయంలో వివాదం జరిగిందని మళ్ళీ అదనంగా డబ్బులు వసూలుచేయడం ఏంటని కంప్యూటర్ ఆపరేటర్‌ను ప్రశ్నించారు.



నార్సింగి గ్రామపంచాయతీ ఆవరణలో వాగ్వాదం

**ఈఓ వివరణ..**
పంచాయతీ కార్యాలయంలో లైసెన్స్ రెన్యువల్ విషయంలో అదనంగా తీసుకున్న 200 రూపాయల పైన ఈవో నాగభూషణం వివరణను కోరగా, లైసెన్సు రెన్యువల్ విషయంలో అదనంగా 200 రూపాయలు కంప్యూటర్ ఆపరేటర్ అడిగిన విషయము నిజమేనని ఈవిషయం పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటానని ఈవో నాగభూషణం తెలిపారు.

## రేషన్ దుకాణాన్ని తనిఖీచేసిన ఆర్ఐ



చక్రియాలలో రేషన్ దుకాణాన్ని తనిఖీచేస్తున్న ఆర్ఐ

**చౌటకూరు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని చక్రియాల్‌లో శుక్రవారం రెవిన్యూ ఇన్స్‌పెక్టర్ ప్రమోద్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. దుకాణంలో నిల్వ ఉన్న రేషన్ బియ్యాన్ని పరిశీలించి వినియోగదారులకు సక్రమంగా రేషన్‌బియ్యం పంపిణీ చేస్తున్నారా అని డీలర్ ఉప్పరి దేవదాస్‌ను అడిగి తెలుసుకున్నారు. మూడు మాసాలకు సంబంధించిన బియ్యం పంపిణీచేయాల్సి ఉన్నందున ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా బియ్యం పంపిణీచేయాలని డీలర్‌లకు సూచించారు. ఈ నెల 30వ తేదీ వరకు రేషన్ దుకాణాలు తెరిచి ఉంచాలని, వంద శాతం బియ్యం పంపిణీ పూర్తయ్యేలా చూడాలని డీలర్‌లకు సూచించారు. రేషన్‌డీలర్లు అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ప్రమోద్‌కుమార్ హెచ్చరించారు.

## ఉపాధ్యాయులు ముందుకు రావాలి



టిపిటిఎఫ్ రాష్ట్ర విద్యాసదస్సు బ్రోచర్ విడుదల చేస్తున్న దృశ్యం

**కొల్చారం, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**
ఈ నెల 30న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో నిర్వహించనున్న టిపిటిఎఫ్ రాష్ట్ర విద్యాసదస్సును విజయవంతం చేయాలని ఉపాధ్యాయులు, విద్యాభిమానులకు పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన కొల్చారంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ గర్ల్స్ రెసిడెన్షియల్ స్కూల్‌లో శుక్రవారం గోడపత్రికను ఆవిష్కరించారు. ఈసందర్భంగా కొల్చారంమండల విద్యాధికారి ఉమారాణి, టిపిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ వి.సంగయ్యలు మాట్లాడుతూ విద్యారంగం ఎదుర్కొంటున్న సవాళ్లు, దేశరాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, సామాజిక స్థితిగతులు వంటి ముఖ్యాంశాలపై చర్చలు జరుగుతాయని తెలిపారు. రాష్ట్ర స్థాయి సదస్సులో ప్రముఖ వక్తలుగా ప్రొ.హరగోపాల్, ప్రొ.కోదండరాం తదితరులు పాల్గొననున్నట్లు తెలిపారు. కాబట్టి అధికసంఖ్యలో ఉపాధ్యాయులు, విద్యాభిమానులు హాజరై సదస్సును విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీరుకుమార్‌చారి, బాబు సిద్దిరాములు, ఎల్లేశం, లక్ష్మీనారాయణ, పోచయ్య, శ్రీనివాస్, ప్రియాంక, షాకీర్, మాధవి, బిందు, సరిత, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మసీ కళాశాలలో ముగిసిన నైపుణ్యాభివృద్ధి శిక్షణ



ఫార్మసీ కళాశాలలో నైపుణ్య శిక్షణ పొందుతున్న విద్యార్థులు

**చౌటకూరు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని సుల్తాన్‌పూర్ జెఎన్టీయు యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మస్యూటికల్ సైన్సెస్, బి-ఫార్మసీ కళాశాల విద్యార్థులకు నిర్వహించిన నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిసాయి. గత మూడు రోజులుగా తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ సహకారంతో బి-ఫార్మసీ మూడవ, నాల్గవ సంవత్సరంలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధిపై శిక్షణతరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో కో-కన్వీనర్ డా.ఎం.అజిత, కో-ఆర్డినేటర్లు డా.చింతా శ్రీనివాస్, ఆర్.అపరంజిత తదితరులు పాల్గొన్నారు.

## పోషణపక్షం కార్యక్రమంలో ఎమ్మెల్యే

**నారాయణఖేడ్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**
నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం పోషణపక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ టీచర్లకు ప్రభుత్వం అందజేసిన నూతన మొబైల్‌ఫోన్లను ఎమ్మెల్యే చేతులమీదుగా పంపిణీచేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ దారం శంకర్, బాణాపురం రాజు, రుక్మిణిగోపాల్‌రెడ్డి, షారుఖాన్, మహేష్‌చౌహాన్, సుబుర్, మైతాబ్, వివేకనంద, లక్ష్మణ్, కౌన్సిలర్లు, తాహెర్ అలీ, పందరిరెడ్డి, మాజీ ఎంపిటిసి, ఐసిడిఎస్ అధికారులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## బోరంచలో చలివేంద్రం ఏర్పాటు
**-చలివేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ బీరప్ప**

**మనూర్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని బోరంచ గ్రామంలో పామమాగడ్డ వద్ద ఎంఎస్‌డి చిట్ ఫండ్(హన్మంతు), శ్రీమొబైల్‌కేర్(హరికృష్ణ)లు ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని గ్రామ సర్పంచి పంచగామ బీరప్ప శుక్రవారం ప్రారంభించారు. బాటసారుల దాహంతీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని, గ్రామంలో చలివేంద్రం ఏర్పాటుచేసిన హన్మంతు, హరికృష్ణలను సర్పంచి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఉపసర్పంచి కరీం, బోరంచ శ్రీనల్ల పోచమ్మ ఆలయ కమిటీ చైర్మన్ మల్లయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆర్టీసీని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి
**-బిజెపి ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి**



ఆర్టీసీకార్మికుల సమ్మెకు మద్దతు పలుకుతున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి దృశ్యం

**రామచంద్రాపురం, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**
టిజి ఆర్టీసీని రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వంలో విలీనంచేసి కార్మికులను ఆదుకోవాల్సిన అవసరం ఉందని బిజెపి పట్టభద్రుల ఎమ్మెల్సీ డాక్టర్ చిన్నమైల్ అంజిరెడ్డి డిమాండ్ చేశారు. రామచంద్రాపురంలోని బిహెచ్ఈఎల్ ఆర్టీసి డిపో వద్ద తమ డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్న ఆర్టీసి కార్మికులకు ఎమ్మెల్సీ అంజిరెడ్డి తన సంపూర్ణ మద్దతు పలికి కార్మికులతో కలిసి ధర్నాలో పాల్గొని ప్రసంగించారు. ఆర్టీసి కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందని మండిపడ్డారు. ఆర్టీసికార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, ఇవి ప్రభుత్వ హత్యలే అని మండిపడ్డారు. ఎలక్ట్రికల్ బస్సులతో ఆర్టీసి కార్మికులను తొలగించే కుట్రలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. మహాలక్ష్మి పథకంతో డ్రైవర్, కండక్టర్లపై ప్రయాణికుల ఒత్తిడి పెరిగిందని గుర్తుచేశారు. కార్మికుల సమ్మెలకు బిజెపి సంపూర్ణమద్దతు ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో టిజిఆర్టిసి జెఎసి సభ్యులు బలరాం, అశోక్, రమేష్, బీవైరెడ్డి, నవీన్‌రెడ్డి, బిజెపి నాయకులు రఘురెడ్డి పాల్గొన్నారు.

## మూడోరోజుకు చేరిన ఆర్టీసీ కార్మికుల సమ్మె
**-సమ్మెకు మద్దతు తెలిపిన భీమ్ ఆర్మి నాయకులు సిద్దు రావణ్**




సమ్మెకు మద్దతు తెలుపుతున్న భీమ్ ఆర్మీ నాయకులు సిద్దు రావణ్

**జహీరాబాద్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**
ఆర్టీసి కార్మికులు తమ డిమాండ్‌ల సాధనకోసం చేస్తున్న సమ్మె శుక్రవారంతో మూడవరోజుకు చేరుకుంది. ఆర్టీసి బస్టాండ్‌ముందు కార్మికులుచేస్తున్న సమ్మెకు భీమ్ ఆర్మీ రాష్ట్ర నాయకులు సిద్దు రావణ్ మద్దతు ప్రకటించి కార్మికులతో కలిసి సమ్మెలో పాల్గొని ఆత్మహత్య చేసుకున్న వరంగల్ జిల్లా నర్సంపేట ఆర్టీసిడిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్న శంకర్‌గౌడ్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా సిద్దు రావణ్ మాట్లాడుతూ శంకర్‌గౌడ్ మరణం ప్రభుత్వ హత్యగా ఆరోపించారు. ఎన్నికల సందర్భంగా ఆర్టీకి కార్మికులను ఉద్దేశించి మేనిఫెస్టోలో చేసిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల డిమాండ్‌లను ప్రభుత్వం పరిష్కరించే వరకు కార్మికులకు అండగా ఉంటూ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్టీసికార్మికుల జెఏసి నాయకులు మాణిక్, వసీం, చంద్రయ్య, శ్రీనివాస్, రాజు, వీరరన్న, స్వాతి, భీమ్ ఆర్మీ టీం సభ్యులు సలీం, శ్రీకాంత్, సందీప్, నాని, భాను ప్రసాద్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పటాన్‌చెరులో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం
**-పాల్గొన్న తెలంగాణ అడిషనల్ సిఈఓ వాసం వెంకటేశ్వర్‌రెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

**పటాన్‌చెరు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**
స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ అడిషనల్ సిఈఓ వాసం వెంకటేశ్వర్‌రెడ్డి శుక్రవారం పటాన్‌చెరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన 11మంది సహాయ ఎన్నికల నమోదు అధికారులు (ఏఈఆర్ఓ), (42) బిఎల్ఓ సూపర్వైజర్లు, బిఎల్ఓలతో సమీక్షాసమావేశాన్ని పటాన్‌చెరు ఎంపిడిఓ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సమీక్షాసమావేశంలో అడిషనల్ సిఈఓ వాసం వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. 2025 ఓటరు జాబితాలోని అర్హులైన ఓటరులందరినీ 2002 ఓటరు జాబితాతో అనుసంధానించాలని సూచించారు. పట్టణప్రాంత నియోజకవర్గాలలో మ్యాపింగ్ ప్రక్రియ చాలా నెమ్మదిగా జరుగుతుందని, బిఎల్వోలు అందరూ ఇంటింటికీ వెళ్ళి ఓటర్ల వివరాలు సేకరించి త్వరితగతిన మ్యాపింగ్ ప్రక్రియను వారంరోజుల్లో పూర్తిచేయాలని ఆదేశించారు. మ్యాపింగ్ ప్రక్రియలో భాగంగా వివిధ రాజకీయపార్టీలకు చెందిన బిఎల్ఏల సహాయం తీసుకోవాలని, రెసిడెన్షియల్ కాలనీవాసులతో సమావేశాలు నిర్వహించి అందరినీ మ్యాపింగ్ అయ్యేలా చూడాలని ఆదేశించారు. ఓటర్లందరూ కూడా సహకరించి ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా అందరూ మ్యాపింగ్ చేయించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఈఆర్వో, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి అంబదాస రాజేశ్వర్, డిప్యూటీ కమీషనర్లు, తహసీల్దారులు, మున్సిపల్ కమిషనర్లు, బిఎల్వో సూపర్వైజర్లు, బిఎల్వోలు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికుల కోర్కెలను పరిష్కరించాలి
**-బిజెపి పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధామల్లేష్‌గౌడ్**



నివాళులర్పించిన వాల్దాస్ రాధామల్లేష్‌గౌడ్, బిజెపి నాయకులు

**నర్సాపూర్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**
ఆర్టీసీ కార్మికుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని, అదేవిధంగా ఈ పోరాటంలో అసువులు బాసిన డ్రైవర్ శంకర్‌గౌడ్ కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని బిజెపి పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షులు రాధామల్లేష్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. శుక్రవారం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గత కొన్నిరోజులుగా ఆర్టిసి కార్మికులు చేస్తున్న సమ్మెకు బిజెపి జిల్లా అధ్యక్షుడు రాధామల్లేష్‌గౌడ్‌తోపాటు బిజెపి మెదక్ జిల్లా శాఖ తరపున మద్దతు తెలపడం జరిగింది. అదేవిధంగా ఆర్టిసి పోరాటంలో అశువులు బాసిన నర్సంపేట డిపో డ్రైవర్ శంకర్‌గౌడ్‌కు నర్సాపూర్ డిపో ఆధ్వర్యంలో అశ్రు నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రాజేందర్, నారాయణరెడ్డి, జిల్లా కోశాధికారి ఆంజనేయులుగౌడ్, నర్సాపూర్ మండల అధ్యక్షులు నీలి నగేష్, శివంపేట మండల అధ్యక్షులు పెద్దపులి రవి, బిజెపి నాయకులు నగేష్‌గౌడ్, చారి, బాలరాజు, 10వ వార్డు బూత్ అధ్యక్షులు సాయెబ్ తదితరులు పాల్గొన్నారు.

## చిప్పల్‌తుర్తిలో ధాన్యం కొనుగోలుకేంద్రం



కొనుగోలుకేంద్రం ప్రారంభించిన సర్పంచి సుధాకర్, తదితరులు

**నర్సాపూర్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**
నర్సాపూర్ మండల పరిధిలోని చిప్పల్‌తుర్తి గ్రామంలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచి సుధాకర్, సిఈఓ వెంకట్‌స్వామిగౌడ్‌లు ముఖ్యఅతిథులుగా హాజరై ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన పంటలను గ్రామ సమీపంలో ఉన్న ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలని సూచించారు. వందేమాతరం రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి సుధాకర్, ఉపసర్పంచి కృష్ణ, సిఈవో వెంకట్‌స్వామిగౌడ్‌తో పాటు వార్డు సభ్యులు గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## మద్యపాన నిషేధంపై ఏకగ్రీవ తీర్మానం

**వెల్దుర్తి, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**
మండలంలోని మంగళపర్తిగ్రామంలో శుక్రవారం జరిగిన గ్రామసభలో ప్రజలందరూ మద్యపాన నిషేధాన్ని చేస్తున్నట్లు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. స్థానిక సర్పంచి రాధారామకృష్ణారావు, గ్రామ కార్యదర్శి నాగరాజు గ్రామసభలో తీర్మానం చేశారు. గ్రామంలో మద్యం అమ్మినవారికి పదివేల రూపాయల జరిమానా, అలాగే తాగినవారికి 5000 రూపాయలు, 5000 రూపాయలుగా గ్రామసభలో తీర్మానం చేశారు.

## ఆర్టీసి కార్మికుల సమ్మెకు సంపూర్ణ మద్దతు
**-ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై.నరోత్తం**

**జహీరాబాద్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**
తమ న్యాయమైన డిమాండ్ల సాధనకోసం సమ్మెచేస్తున్న ఆర్టీసి కార్మికులకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఏర్పుల నరోత్తం పేర్కొన్నారు. శుక్రవారం నరోత్తం మాట్లాడుతూ నర్సంపేట డిపో కార్మికుడు శంకర్‌గౌడ్ ప్రభుత్వం చేతకానితనానికి ఆత్మాహుతి చేసుకోవడం ప్రభుత్వహత్యగా పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ఆర్టీసి కార్మికుల పాత్ర కీలకమని, కార్మిక జెఏసి 40 రోజులు ముందే సమ్మె నోటీసులు ఇచ్చినా, ప్రభుత్వం స్పందించకపోవడం, కార్మికుల సమ్మె హరీష్‌రావు కుట్ర అని మంత్రి పేర్కొనడం సరికాదని దుయ్యబట్టారు. ఆర్టీసిలో ఎలక్ట్రికల్ బస్సులను ప్రైవేటు వ్యక్తులతో పరుగులు పెడితే కార్మికులు అయోమయానికి గురికావాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు. డ్రైవర్ శంకర్‌గౌడ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి శంకర్, నాయకులు ఎస్.గోపాల్ తదితరులు ఉన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాలే పిల్లల భవిష్యత్తుకు పునాది
**-డిడబ్ల్యుఓ హేమాభార్గవి**

**నర్సాపూర్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**
అంగన్‌వాడీ కేంద్రాలే పిల్లల చదువుల భవిష్యత్తుకు వునాది వంటివని డిడబ్ల్యుఓ హేమాభార్గవి అన్నారు. శుక్రవారం నర్సాపూర్ మండల పరిధిలోని గ్రామంలో గల ఒకటి రెండు అంగన్‌వాడీ కేంద్రాలలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి డిడబ్ల్యుఓ హేమాభార్గవి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ చిన్నారులు గ్రాడ్యుయేషన్ పట్టా పుచ్చుకొని గ్రాడ్యుయేషన్ దుస్తులలో కనిపించి అందరినీ ఆకట్టుకున్నారు. అదేవిధంగా చిన్నారులు ఆటపాటలతో అందరినీ అలరించారు. కార్యక్రమంలో డిడబ్ల్యుఓ హేమాభార్గవితో పాటు సూపర్వైజర్ సంతోషిమాత, అంగన్‌వాడీ టీచర్లు లతీఫ్ ఉన్నీసా బేగం, కవిత, గ్రామసర్పంచి సుధాకర్, ఉపసర్పంచి కృష్ణ, వార్డుసభ్యులు విజయలక్ష్మి, లక్ష్మీశివకళ, చంద్రయ్య, అనిల్‌కుమార్, రాములు, శాంతి కుమార్, గ్రామపెద్దలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కొత్త ఆలోచనలతో ముందుకు సాగాలి
**-కెవికె కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.రఘునందన్**



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కళాశాల ప్రతినిధులు

**నర్సాపూర్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**
విద్యార్థులు ఫార్మసీరంగం ప్రయోగాలపై దృష్టిసారించి కొత్త ఆలోచనలతో ముందుకు సాగాలని కెవికె కాలేజీ అఫ్ ఫార్మసీ ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.రఘునందన్ అన్నారు. నర్సాపూర్ సమీపంలోని వైపర్ ఫార్మసీ కళాశాలలో ఔషద్ 2026 అంతర్జాతీయ సదస్సులో భాగంగా రెండవ రోజు శుక్రవారం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కెవికె కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.రఘునందన్ హాజరయ్యారు. కార్యక్రమంలో నిర్వహించిన ఓరల్, పోస్టర్ ప్రజెంటేషన్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అంతేగాక విష్ణుకప్ 2025 క్రీడలకు సంబంధించిన క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు సైతం బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వైపర్ కళాశాల ప్రిన్సిపాల్ డా.రమేష్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ పి.రాజశేఖర్, కళాశాల హెచ్ఓడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నీటి సమస్యను తీర్చిన సర్పంచి

**వెల్దుర్తి, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన వెల్దుర్తిలోని కోటకింద రెండోవార్డ్‌లో వేసవికాలం అయినందున నీటి సమస్య తీవ్రరూపం దాల్చడంతో ప్రజలకు నీటి సమస్య ఏర్పడింది. దీంతో స్థానిక సర్పంచి ఆదర్శ, ఉపసర్పంచి శ్రవణ్, వార్డుసభ్యులు కొమురయ్య, పుష్పమా కలిసి శుక్రవారం బోర్‌కు మోటార్ బిగించి నీటి సమస్యను పరిష్కరించారు.



కర పత్రం విడుదల చేస్తున్న ముదిరాజ్ సంఘం నేతలు

## మే 3న కోకాపేట ముదిరాజ్ భూమిలో వంటవార్పు

**చిన్నకోడూరు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** కెసిఆర్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో 2014 లెక్కల ప్రకారం ముదిరాజ్‌లు 45 లక్షల జనాభా ఉంటే రేవంత్‌రెడ్డి సర్కార్‌లో 26 లక్షలు చూపించడం ఏమిటని ముదిరాజ్ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ ప్రశ్నించారు. చిన్నకోడూరులో ఆయన శుక్రవారం కరపత్రం విడుదల చేసి మాట్లాడారు. కెసిఆర్ ప్రభుత్వహయాంలో ముదిరాజ్‌లకు కోకాపేటలో ముదిరాజ్ సంఘం భవన నిర్మాణానికి 5 ఎకరాల భూమిని కేటాయించారని తెలిపారు. ముదిరాజ్ సంఘం భవన నిర్మాణానికి కేటాయించిన 5 ఎకరాల భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడుకోవడానికి మే 3న కోకాపేటలోని ముదిరాజ్ ఆత్మగౌరవ భూమిలో వంటవార్పు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి రాష్ట్రంలోని నలుమూలల నుంచి ముదిరాజ్‌లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు చెరుకు నారాయణ, గుడిపల్లి వికాస్, దయ్యాల నాగరాజు, చిట్యాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## శంకర్‌గౌడ్ కుటుంబానికి రూ. 50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

### గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర శ్రీనివాస్‌గౌడ్



మాట్లాడుతున్న బుర్ర శ్రీనివాస్‌గౌడ్

**హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** ఆర్టీసీ కార్మికుల డిమాండ్ల సాధన కోసం నర్సంపేట డిపోలో పనిచేస్తున్న డ్రైవర్ శంకర్‌గౌడ్ ఆత్మబలిదానం చేసుకోవడం తీవ్ర విషాదకరమని, ఈ ఘటనకు పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని గౌడ జనహక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెలో భాగంగా మూడవ రోజు హుస్నాబాద్ ఆర్టీసీ డిపో ఎదుట నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శంకర్‌గౌడ్ ఆత్మబలిదానం రాష్ట్రాన్ని కలచివేసిందన్నారు. ఆర్టీసీ కార్మికులు ఆత్మహత్యల దారిలో వెళ్లకూడదని, అలాంటి చర్యలతో సమస్యలు పరిష్కారం కావని, పోరాటాల ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి న్యాయమైన డిమాండ్లను సాధించుకోవాలని సూచించారు. మృతుడి కుటుంబానికి వెంటనే రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు శ్యాంసుందర్, ఆర్టీసీ హుస్నాబాద్ డిపో జేఏసీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, కార్మికులు రామ్మోహన్ రెడ్డి, రాజిరెడ్డి, తిరుపతి, మోహన్, భాగ్యలక్ష్మి, శైలజ, రజిత, జ్యోతి, సరిత పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలపై పోలీసుల వినూత్న ప్రచారం



పాటతో ట్రాఫిక్ నిబంధనపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

**హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించాలంటూ ట్రాఫిక్ పోలీసులు వినూత్నంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ మొగిలి నాయక్ హ్యాండ్ మైక్ ద్వారా పాట రూపంలో ప్రధాన కూడళ్లలో వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు. వేగం కన్నా ప్రాణం మిన్న అనే సందేశంతో ప్రత్యేకంగా పాడిన పాట ద్వారా ట్రాఫిక్ నిబంధనలను సులభంగా ప్రజలకు చేరవేస్తున్నారు. ఈ సందర్భంగా మద్యం తాగి వాహనాలు నడపరాదని, తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచిస్తున్నారు. అలాగే ద్విచక్ర వాహనాలపై ఇద్దరికి మించి ప్రయాణించరాదని, హెల్మెట్ ధరించడం తప్పనిసరి అని తెలియజేస్తున్నారు.

## దళారులను నమ్మి మోసపోవద్దు : సర్పంచ్



కొత్తపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ శ్యామలమల్లేశం

**రాయపోల్, ఏప్రిల్ 24 (ప్రభాతవార్త):** రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని కొత్తపల్లి గ్రామ సర్పంచ్ ఎక్కాల శ్యామలమల్లేశం తెలిపారు. శుక్రవారం కొత్తపల్లిలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో పారదర్శకంగా ధాన్యం తూకం వేసి, నేరుగా రైతుల ఖాతాల్లో డబ్బులను జమ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పరమేశ్వర్, వార్డు సభ్యులు మన్నె కల్పన, పంగ కల్పన, కస్తూరి కనకయ్య, కొప్పుల నర్సింలు, సిపి మల్లేశం, రైతులు రాజనర్సు, బాలయ్య, కొమురవెల్లి, ఆంజనేయులు, హరిబాబు, యాదయ్య, మహేష్, ఐకెపి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి పన్నును సకాలంలో చెల్లించాలి

**గజ్వేల్ టౌన్, ఏప్రిల్ 24 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు ఇంటి పన్నును సకాలంలో చెల్లించి ప్రభుత్వం కల్పిస్తున్న 5 శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ దీపిక కోరారు. 2026-27 ఆర్థిక సంవత్సరంకు సంబంధించిన పన్ను ముందుగా చెల్లించే వారికి ఈ రాయితీ వర్తిస్తుందని తెలిపారు. ఈ క్రమంలో సెయింట్ జోసెఫ్ విద్యాసంస్థ యాజమాన్యం తమ విద్యాసంస్థకు సంబంధించిన పన్ను మొత్తాన్ని రాయితీ పోగా రూ.1,67,430 చెల్లించినట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ నెలాఖరు లోగా పన్ను చెల్లించే వారికి 5 శాతం రాయితీ లభిస్తుందని, పట్టణ ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.



పన్ను రశీదు అందజేస్తున్న మున్సిపల్ బిల్ కలెక్టర్లు



ప్రతిజ్ఞ చేస్తున్న సర్పంచ్, ఉపసర్పంచ్ వార్డుసభ్యులు, అధికారులు

## కొమురవెల్లిలో గ్రామసభ

**కొమురవెల్లి, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని కొమురవెల్లి గ్రామపంచాయతీ పరిధిలో శుక్రవారం సర్పంచ్ గొల్లపల్లి పద్మ ఆంజనేయులు అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. గ్రామసభలో జలజీవన్ మిషన్, తాగునీరు, స్వచ్ఛభారత్ మిషన్, పారిశుధ్య, మురికి నీటి నిర్వహణ, వ్యక్తిగత శుభ్రతచ ఆరోగ్యం, సంకల్పం తదితర అంశాలపై చర్చించారు. స్వచ్ఛ గ్రామం-ఆరోగ్య భారతం సాధించడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ లక్ష్మప్ప, ఉపసర్పంచ్ పోతుగంటి శ్రీనివాస్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళా సంఘ సభ్యులు, యువజన సంఘ సభ్యులు, గ్రామస్థాయి అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నిజాయితీగా పనిచేస్తే విజయం సాధించవచ్చు




అవగాహన సదస్సులో సత్కరిస్తున్న దృశ్యం

**సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** నిజాయితీగా పనిచేస్తే విజయం దానంతట అదే వరిస్తుందని సిద్దిపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు రమేష్‌బాబు, లీగల్ సెల్ అథారిటి డిప్యూటీ చీఫ్ శరత్‌బాబు అన్నారు. మూట్ కోర్టు ప్రాజెక్టులో భాగంగా వినాయక లా కళాశాల విద్యార్థులు శుక్రవారం సిద్దిపేటలోని కోర్టులను సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. న్యాయవాదులు నిజాయితీగా పనిచేయాలన్నారు. బాధితుల పక్షాన న్యాయవాదులు నిలబడాలన్నారు. న్యాయవాదులు రాణించాలంటే లాంగ్వేజెస్ నేర్చుకోవాలన్నారు. జిల్లా లీగల్ సెల్ అథారిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చైల్డ్ మ్యారేజ్, ప్రొటెక్షన్ అవగాహన సదస్సులో లా విద్యార్థులు పాల్గొన్నారు. డిఎస్ఎల్ డిప్యూటీ చీఫ్ శరత్‌బాబు విద్యార్థులకు చైల్డ్ ప్రొటెక్షన్, చైల్డ్ మ్యారేజ్‌పై ఉన్న చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి సదానందం, లా కళాశాల ప్రిన్సిపల్ రాజు, వైస్ ప్రిన్సిపల్ రవీందర్ పాల్గొన్నారు.

## మద్దతు ధర కల్పించేందుకే కొనుగోలు కేంద్రాల ఏర్పాటు



మదూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ మాలతి

**చిన్నశంకరంపేట, ఏప్రిల్ 24,ప్రభాతవార్త:** రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించేందుకే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని తహసీల్దార్ మాలతి తెలిపారు. శుక్రవారం మండల పరిధి మదూర్ లో సర్పంచి దివ్యభారతి గౌడ్‌తో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని, మధ్యదళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి లక్ష్మీ ప్రవిణ్, లింగం గౌడ్, సీఈవో కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## చెరువుల పరిరక్షణకే సర్వే : తహసీల్దార్



పెద్ద చెరువును సర్వే చేస్తున్న అధికారులు

**చిన్నశంకరంపేట, ఏప్రిల్ 24,ప్రభాతవార్త:** చెరువుల పరిరక్షణ కోసం సర్వే చేపడుతున్నట్లు తహసీల్దార్ మాలతి తెలిపారు. శుక్రవారం మండల పరిధి చందంపేట, రుద్రారం, గ్రామాలను కలుపుతూ ఉన్న పెద్ద చెరువును ఇరిగేషన్, అటవిశాఖ, అధికారులతో కలిసి సంయుక్త సర్వే నిర్వహించారు. ఈ సర్వే ద్వారా చెరువుల హద్దులను స్పష్టంగా నిర్ధారిస్తామని తెలిపారు. భవిష్యత్తులో చెరువులను ఆక్రమించకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇరిగేషన్ ఏఈ వాసుదేవ్, సర్వేయర్ లక్ష్మీ, సర్పంచులు నాయిని ప్రవిణ్ కుమార్, సంతోష తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు సదుపాయాలు కల్పించాలి : ఎంపిడివో



ఉపాధి హామి కూలిలతో మాట్లాడుతున్న ఎంపీడీవో దామోదర్

**చిన్నశంకరంపేట, ఏప్రిల్ 24,ప్రభాతవార్త:** ఉపాధి హామి పనులు చేపడుతున్న ప్రాంతాలలో కూలీలకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని ఎంపీడీవో దామోదర్ నిర్వాహకులకు సూచించారు. శుక్రవారం మండల పరిధి మిర్జాపల్లిలో ఉపాధి హామి కూలీలతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున కావలిసిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.

## నేడు పలు ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేత

**నిజాంపేట్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** చెట్ల కొట్టివేత, నిర్వహణ పనుల నేపథ్యంలో నేడు బచ్చుపల్లి పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు నిజాంపేట్, ఎస్ఎంఎస్, మా విల్లాస్, ఎస్ఎల్‌జీ, వెంకట్ ప్రణీత్, తరుణ్ భాస్వాని, హిల్ కౌంటీ రోడ్, కాకతీయ నగర్, ఇందిరా నగర్, బచ్చుపల్లి గ్రామం, ఎస్సీ కాలనీ, సీతారామ హోమ్స్, మా విల్లాస్, బొల్లారం పరిశ్రమల ప్రాంతం, ప్రణీత్ అంటిల్లా రోడ్, కౌసల్య కాలనీ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోనుంది. విద్యుత్ సరఫరా నిలిపివేతపై ప్రజలు సహకరించాలని, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని బచ్చుపల్లి విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ ఎ.శశిధర్ కోరారు.



గజ్వేల్‌లోని వై జంక్షన్ రోడ్డుపై ఏర్పడిన గుంతలు

## ప్రధాన రహదారిపై గుంతలు

### -పట్టించుకోని అధికారులు

**గజ్వేల్ టౌన్, ఏప్రిల్ 24 (ప్రభాతవార్త):** అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా చెప్పుకునే గజ్వేల్ మున్సిపాలిటీలో ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. మున్సిపల్‌లోని 15వ వార్డు పరిధిలో గల తూప్రాన్-చేగుంట వై జంక్షన్ ప్రధాన రోడ్డుపై ఉన్న మ్యాన్‌హోల్ చుట్టూ ఏర్పడిన భారీ గుంతలతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. నిత్యం ఈ రహదారిపై వేల సంఖ్యలో వాహనాల రాకపోకలు జరుగుతుంటాయి. రాత్రి వేళలో గుంతలు కనిపించక ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి పడిపోయిన సంఘటనలు ఉన్నాయి. రోడ్డుపై గుంతలు ఏర్పడి వాహనదారులు ఇబ్బందులుపడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకొని ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా ఏర్పడిన గుంతలను మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

## గర్భిణీలకు మాతృదేవోభవ న్యూట్రిషన్ కిట్లు పంపిణీ



గర్భిణీలకు న్యూట్రీషన్ కిచెన్ అందజేస్తున్న ఆవుల రాజిరెడ్డి

**వెల్దుర్తి, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** మాసాయిపేట మండలంలోని మాసాయిపేట, కొప్పులపల్లి, అచ్చంపేట. హకీంపేట, బొమ్మరం, పోతనపల్లి. నక్సాన్పల్లి చెట్ల తిమ్మాయిపల్లి. నడిమి తండా గ్రామాల గర్భిణీ స్త్రీలకు సుమారు 100 మంది మాతృదేవోభవ కిట్లను నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ టిపిసిసి కార్యదర్శి ఆవుల రాజురెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీలు ఆరోగ్యంగా ఉండడం ఎంతో అవసరమని అందుకు గర్భధారణ సమయంలో సరైన పోషకాలు తీసుకోవడం ద్వారా మరియు శిశువు ఆరోగ్యం బాగుంటుందని ఆయన తెలిపారు. సమాజంలో గర్భిణీలపట్ల వారి ఆరోగ్యాన్ని కాపాడడం మనందరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాసాపేట సర్పంచ్ కృష్ణారెడ్డి, నాయకులు సిద్ధిరాములు గౌడ్. తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 'గీతం'లో ఫ్యాకల్టీ రూమ్స్, కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం



గీతంలో కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

**పటాన్‌చెరు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న అధ్యాపకులను తీర్చిదిద్దే చైతన్యవంతమైన కేంద్రంగా గీతం స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ ను రూపొందించినట్టు విభాగాధిపతి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రిచాశర్మ పేర్కొన్నారు. హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ కోసం కొత్తగా రూపొందించిన అధ్యాపకుల గదులు, విద్యార్థుల కోసం నెలకొల్పిన కంప్యూటర్ ల్యాబ్‌ను అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు శుక్రవారం లాంఛనంగా ప్రారంభించి, అత్యాధునిక సౌకర్యాలతోకూడిన ఆయా ప్రదేశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ రిచాశర్మ మాట్లాడుతూ, విద్యాపరమైన సహకారాన్ని, అర్థవంతమైన సంభాషణలను ప్రోత్సహించి, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా అధ్యాపకులను తీర్చిదిద్దుతున్నట్టు తెలియజేశారు. 2026-27 విద్యా సంవత్సరంనుంచి రెండు నాలుగేళ్ల సమీకృత ఉపాధ్యాయ విద్యా కార్యక్రమాలను(ఐటీఈపీ) ప్రారంభించనున్నట్టు రిచాశర్మ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఆతిథ్య విభాగంక్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్‌లతోపాటు పలువురు డైరెక్టర్లు, ప్రిన్సిపాళ్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బీరంగూడలో రక్తదాన శిబిరం

**అమీన్‌పూర్, ఏప్రిల్ 24 (ప్రభాతవార్త) :** అమీన్‌పూర్ మండలం బీరంగూడలో బీఆర్ఎస్ యువ నాయకుడు రవి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రవి యువసేన ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేయగా, పలువురు యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేసి తమ సామాజిక బాధ్యతను చాటుకున్నారు.ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ, జన్మదిన వేడుకలు కేవలం ఆనందోత్సవాలకే పరిమితం కాకుండా సమాజానికి ఉపయోగపడే విధంగా జరగాలని అన్నారు. ప్రజాసేవే లక్ష్యంగా తీసుకుని భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీరంగూడ బీఆర్ఎస్ రవి యువసేన సభ్యులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## విశ్వబ్రాహ్మణ కులాన్ని యధాతధంగా బిసి జాబితాలోనే ఉంచాలి

**సైఫాబాద్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** బిసి కులాల జాబితాలో గ్రూప్-బిలో 21లో చేర్చబడిన విశ్వబ్రాహ్మణ (విశ్వకర్మ) అనే కులం పేరును ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ నిర్లక్ష్యంగా తీసివేయడం దారుణమని ఇండియన్ విశ్వకర్మ ఆఫీసర్, బిసినెస్మెన్ అండ్ ప్రొఫె షనల్స్ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు బిఎన్‌వి రాజశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై రాష్ట్ర ముఖ్యమంత్రి, గవర్నర్, రాష్ట్ర బిసి కమిషన్ ఛైర్మన్ తదితర అధికారులకు విజ్ఞప్తి చేయ డం జరిగిందని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన తెలిపారు. 2024లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో వచ్చినరిపోర్ట్‌ను ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిందని, ఈ తప్పును ప్రభుత్వం సరిచేయకపోవడం అ న్యాయమన్నారు. బిసి జాబితాలో ఉన్న విశ్వబ్రాహ్మణ కులంపేరును యధాతధంగా పునరుద్ధరించాలని ఆయన కోరారు.

## ఆర్టీసి కార్మికులు ఆత్మహత్య చేసుకోవద్దు

### -టిపిసిసి మాజీ కార్యదర్శి లక్‌పతి యాదగిరిగౌడ్

**హైదరాబాద్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త**

ఆర్టీసీ కార్మికులు ఎవ్వరు ఆత్మహత్యలు చేసుకోవద్దని టిపిసిసి మాజీ కార్యదర్శి లక్‌పతి యాదగిరిగౌడ్ విజ్ఞప్తి చేశారు.వరంగల్ జి ల్లా నర్సంపేటలో ఆర్టీసీ డ్రైవర్ శంకర్‌గౌడ్ ఆత్మహత్య చేసుకో వడం చాలా బాధాకరమని విచారణ వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి,పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్,రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ కార్మికుల సమ స్యలు పరిష్కరించేందుకు సానుకూలంగా ఉన్నారని, తొందరపాటు నిర్ణయంతో ప్రాణం పోతే తిరిగి రాదని కార్మికులు ఎవరు ఆత్మహ త్యలకు పాల్పడకూడదని కోరారు.తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన తర్వా త బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ కార్మికులు 42 రోజుల సమ్మెలో 21 మంది కార్మికులు మృతి చెందారని గుర్తు చేశారు. బిఆర్ఎస్, బిజెపి పార్టీలు ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయాలని చూస్తున్నాయని, రాజకీయ లబ్ధి కోసం శవాలతో రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు.శాంతియుతంగా ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించుకోవాలని యాదరిగిగౌడ్ సూచించారు.



గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ పత్తి నర్సింలు యాదవ్

## ఆదర్శ గ్రామమే లక్ష్యంగా పనిచేస్తా : సర్పంచ్

**మర్కుక్, ఏప్రిల్ 24 (ప్రభాతవార్త):** అందరి సహకారంతో గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు పనిచేస్తామని సర్పంచ్ పత్తి నర్సింలు యాదవ్ అన్నారు. శుక్రవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని దామరకుంట గ్రామంలో సర్పంచ్ పత్తి నర్సింలు యాదవ్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. గ్రామ స్వచ్ఛత, ఆరోగ్యం, నీటి భద్రతపై అవగాహన కల్పిస్తూ వివిధ అంశాలపై చర్చించారు. జల జీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికి తాగునీటి కనెక్షన్లు, వేసవిలో నీటి కొరత నివారణచర్యలపై అధికారులు వివరించారు. గ్రామంలోని చెరువులు, బావుల సంరక్షణ, వర్షపు నీటి సేకరణపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని తెలిపారు. స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా 100 శాతం మరుగుదొడ్ల వినియోగం, చెత్త సేకరణ, గ్రామ శుభ్రత, ప్లాస్టిక్ వినియోగం తగ్గింపుపై చర్చించారు. అలాగే మురికి నీటి నిర్వహణ, ఇంకుడు గుంతల ఏర్పాటు, కిచెన్ గార్డెన్స్ ద్వారా నీటి పునర్వినియోగంపై అవగాహన కల్పించారు. గ్రామ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, యువత, మహిళా సంఘాలు ముందుండాలని పేర్కొన్నారు. స్వచ్ఛ గ్రామం, ఆరోగ్య భారతం సాధనకు ప్రతి కుటుంబం నియమాలను పాటించాలని, గ్రామాన్ని ఓడిఎఫ్ ప్లస్ మోడల్‌గా తీర్చిదిద్దాలని సభలో తీర్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ దేవి రమేష్, పాలకవర్గ సభ్యులు, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, కార్యదర్శి శాంతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రతి మొక్కను సంరక్షించాలి : ఎంపిడివో

**మర్కుక్, ఏప్రిల్ 24 (ప్రభాతవార్త):** నర్సరీలో పెంచుతున్న వివిధ రకాల మొక్కల పెరుగుదలకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఎంపిడివో అశోక్‌కుమార్, సర్పంచ్ పత్తి నర్సింలుయాదవ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని దామరకుంట గ్రామంలో నర్సరీని సందర్శించి మొక్కల రక్షణ చర్యలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మొక్కల పెరుగుదలకు అవసరమైన నీటి సరఫరా, ఎరువుల వినియోగం, మొక్కల రక్షణ చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ నర్సరీ నిర్వహణలో శుభ్రత పాటించాలని, మొక్కల జీవన శాతం పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి మొక్కను బాధ్యతగా సంరక్షించాలని ఆదేశించారు. గ్రామంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు నర్సరీలు కీలకమని, అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి శాంతి, ఉపసర్పంచ్ దేవి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## హుస్నాబాద్‌లో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం

**హుస్నాబాద్ టౌన్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** పట్టణంలోని రెండో వార్డుకు చెందిన పచ్చిమట్ల లక్ష్మికి మొదటివిడతలో మంజూరైన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తిచేసుకుని, శుక్రవారం గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మి, వైస్ చైర్మన్ చిత్తారి పద్మ రవిందర్, కౌన్సిలర్ బూరుగులత కిష్టస్వామి, వార్డు అధికారి శంకర్, హుస్నాబాద్ సింగిల్ విండో మాజీ చైర్మన్ బొలిశెట్టి శివయ్య, 11వ వార్డు కౌన్సిలర్ పూదరి వరప్రసాద్, 10వ వార్డు కౌన్సిలర్ సావుల మంజుల, వడ్డేపల్లి వెంకటరమణ, దండి కొమురయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పథకం ద్వారా మరిన్ని అర్హులైన కుటుంబాలకు లబ్ధి చేకూరాలని ఆకాంక్షించారు.

## వాసవీ మాత జయంతి అధికారిక నిర్వహణపై హర్షం

**హుస్నాబాద్ టౌన్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** శ్రీవాసవి మాత జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడం పట్ల ఆర్యవైశ్య నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆర్యవైశ్య మహాసభ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు తణుకు ఆంజనేయులు, మహిళా విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాడిశెట్టి హేమలత, జిల్లా ప్రధాన కార్యదర్శి చొల్లేటి లత, హుస్నాబాద్ పట్టణ అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్, యువజన విభాగం అధ్యక్షుడు కంభంపాటి సందీప్ మాట్లాడుతూ ఈ నిర్ణయం సమాజానికి గౌరవం తీసుకువస్తుందని తెలిపారు. ఈ నెల 26న జరిగే వేడుకల్లో ఆర్యవైశ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో సీమంతం

**హుస్నాబాద్ టౌన్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** పట్టణంలోని శివాజీనగర్ లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ఆరోగ్యలక్ష్మి కమిటీ ఏర్పాటు చేసి, గర్భవతులకు సీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ చైర్మన్, 15వ వార్డ్ కౌన్సిలర్ ఆకుల రజిత మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భవతులు, బాలింతలు, 3 నుంచి 5 సంవత్సరాల లోపు పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నారని తెలిపారు. గర్భవతులు క్రమంతప్పకుండా ఆరోగ్యపరీక్షలు చేయించుకోవాలని, అందుబాటులో ఉన్న ఆశా కార్యకర్తలకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 20వ వార్డ్ కౌన్సిలర్ గోపగోని శోభన్ బాబు, కమిటీ సభ్యులు కృష్ణమూర్తి, అంగన్వాడి టీచర్, సూపర్వైజర్ కవిత, ఆశా కార్యకర్త అనిత, ఆరోగ్య లక్ష్మి కమిటీ సభ్యులు, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.

## రామాయపల్లిలో ఉచిత వైద్య శిబిరం

**చిన్నశంకరంపేట, ఏప్రిల్ 24,ప్రభాతవార్త:** మండల పరిధిలోని రామాయపల్లిలో శుక్రవారం నాడు మల్లారెడ్డి ఆసుపత్రి వారి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం శుక్రవారం ఏర్పాటు చేశారు. 100 మంది గ్రామస్థులకు పైగా వైద్యం అందించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను అందించారు. కార్యక్రమంలో సర్పంచి రేణుక, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీని చేయించుకోవాలి

**చిన్నశంకరంపేట, ఏప్రిల్ 24,ప్రభాతవార్త:** ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీని చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి లక్ష్మీప్రవీణ్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కొత్తగా వ్యవసాయ భూములు రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులు బ్యాంకు ఖాత, ఆధార్, పట్టాపాస్ పుస్తకం జిరాక్స్‌లను మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో, గవ్వలపల్లి, చిన్నశంకరంపేట రైతు వేదిక భవనంలో ఇవ్వాలని తెలిపారు. ఆధార్‌తో ప్రతి పౌరునికి గుర్తింపు ఇచ్చినట్లుగానే, ప్రతి రైతుకు 14 నెంబర్లతో విశిష్ట సంఖ్య కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## రైతు సంక్షేమమే సర్కార్ ధ్యేయం

### కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ

**సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని వెంకటాపూర్‌లో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దేవి, ఉప సర్పంచ్ సుమన్, వార్డు సభ్యులు స్వామి, కృష్ణ, సత్తవ్వ, చామంతి, ప్రభాకర్, నాగరాజు, చంద్రకళ, ఏఈవో రాజు, పార్టీ నాయకులు దుర్గయ్య, రాజ్‌మహమ్మద్, శ్రీకాంత్, మహేందర్‌రెడ్డి, అంజిరెడ్డి, లక్ష్మీ, శ్రీనివాస్‌రెడ్డి, పంతం శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని బూర్గుపల్లి ప్రాథమిక పాఠశాలలో రూ.10 లక్షలతో నిర్మించతలపెట్టిన ప్రహరీగోడ, గేట్ నిర్మాణా పనులను హరికృష్ణ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మ బాలయ్య, వార్డు సభ్యులు రేణుక, లిఖిత్‌సాయి, నాయకులు యాదగిరి, కనకయ్య, అంజయ్య పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న హరికృష్ణ

# రీసర్వేతో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం

-నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**పెద్దశంకరంపేట, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**
కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల భూసమస్యల శాశ్వత పరిష్కారం కోసం భూభారతి కార్యక్రమం ద్వారా భూముల రీసర్వే చేపట్టినట్లు నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని కమలాపూర్‌లో నిర్వహించిన గ్రామ సభలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ భూముల రికార్డుల్లో ఉన్న పొరపాట్లు, సరిహద్దు వివాదాలు, హక్కుల సమస్యలను పూర్తిగా నివారించడమే భూముల రీసర్వే లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వం అత్యాధునిక సాంకేతికతతో ఈ రీసర్వేను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. వివాదాలను అధిగమించడానికి గ్రామంలోని ప్రతి ఇంచి భూమిని కూడా డిజిటల్ పద్ధతిలో సర్వే చేయనున్నట్లు వివరించారు. ఈ సర్వే పూర్తయిన తర్వాత ప్రతి భూకమతానికి భూధార్ నంబర్‌ను కేటాయించనున్నట్లు తెలిపారు. అనంతరం ఎడి కిషన్ మాట్లాడుతూ జిల్లాలో మ్యాపులు లేని 24 గ్రామాలను మొదటగా రీసర్వేకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ముందుగా గ్రామ సరిహద్దులను నిర్ణయించి అనంతరం ప్రభుత్వ భూముల సర్వే, తర్వాత రైతుల పట్టా భూముల సర్వే చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రభుదాస్, ఎంపిడివో క్రాంతికుమార్, డిఐ హాజీం, సర్పంచులు కుంట్ల సుజాత, పేరుమాల్ గౌడ్, ఉపసర్పంచి లింగరాజు, నాయకులు రాయిని మధుసూదన్, మురళిపంతులు, రాజేందర్ గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, కుంట్ల శ్రీనివాస్, కుంట్ల రాములు, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

# త్వరితగతిన సర్ సమస్యల పరిష్కారం

-రామాయంపేటలో తహసీల్దార్ సమీక్షాసమావేశం
-బిఎల్ఓలతో చర్చలు
-మున్సిపల్ కార్యాలయంలో పరిశుభ్రత కార్యక్రమం

**రామాయంపేట, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**
సర్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు శుక్రవారం రామాయంపేట మున్సిపాలిటీలో తహసీల్దార్ రజనీకుమారి ఆధ్వర్యంలో ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బూత్ లెవల్ అధికారులైన (బిఎల్ఓ)లు పాల్గొని ప్రస్తుత సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై చర్చించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సమస్యలను సమయానికి పరిష్కరించాలని తహసీల్దార్ సూచించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించారు. కార్యాలయం పరిసరాల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించే కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, బూత్ లెవల్ ఏజెంట్లు (బిఎల్ఎలు) చురుకుగా పాల్గొన్నారు. పరిశుభ్రమైన వాతావరణం ప్రజలకు మెరుగైన సేవలను అందించేందుకు దోహదపడుతుందని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా సమస్యల పరిష్కారంతో పాటు కార్యాలయ పరిసరాల్లో శుభ్రతకు ప్రాధాన్యం ఇచ్చినట్లు స్పష్టం చేశారు.



సమీక్షాసమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రజనీకుమారి

## వైభవంగా వేంకటేశ్వర ఆలయ వార్షికోత్సవం

**పెద్దశంకరంపేట, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**
పట్టణంలోని శ్రీగోదా సమేత లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలు శుక్రవారం కన్నులపండువగా ప్రారంభమయ్యాయి. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో హోమం, పుణ్యహవచనం తదితర కార్యక్రమాలు చేపట్టారు. ఈనెల 25న శనివారం వేంకటేశ్వరస్వామి కళ్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త, కేంద్ర ఫుడ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ విగ్రాం శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆలయాన్ని వివిధరకాల పూలతో అందంగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయపూజారులు మహేష్‌శర్మ. రామన్నపంతులు, గంగాధర్‌గౌడ్, భూమేశ్వర్‌గౌడ్, రాజన్‌గౌడ్, చేనేత సహకార సంస్థ మాజీ చైర్మన్ కృష్ణమూర్తి, భక్తులు పాల్గొన్నారు.

## ఆధికారికంగా వాసవి కన్యకాపరమేశ్వరి జయంతి



విలేకర్ల సమావేశంలో ప్రసంగిస్తున్న కౌడ శ్రీనివాస్‌గుప్తా

**కౌడిపల్లి, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**
శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీమాత జయంతిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధికారికంగా నిర్వహించడం హర్షించదగ్గ విషయం అని ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కౌడ శ్రీనివాస్‌గుప్తా తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘం కులదైవం శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీమాత జయంతిని ప్రభుత్వం ఆధికారికంగా నిర్వహించాలని సిఎం తీసుకున్న నిర్ణయంపట్ల ఆర్యవైశ్య సంఘం తరపున రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తాను ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఈయనతోపాటు కౌడిపల్లి ఆర్యవైశ్య సంఘం నాయకులు ఉడుత రాజు గుప్తా, ఉడుత వెంకటేశంగుప్తా, నాండ్ల వెంకటేశగుప్తా, సిద్దిరాములు గుప్తాలతోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు

-మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంది కృష్ణ



రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

**సదాశివపేట, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**
శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతిని రాష్ట్రపండుగగా ప్రకటించినందుకు రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతగా స్థానికంగా క్షీరాభిషేక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంది కృష్ణ మాట్లాడుతూ, ఆర్యవైశ్యుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే ఈ నిర్ణయంపట్ల సమాజం ఆనందం వ్యక్తంచేస్తున్నదని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు సాయిరాజ్, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున శంకర్, కోశాధికారి బిక్షపతి, ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి పురం సుధాకర్, యువజన సంఘం అధ్యక్షులు దిడిగే నగేష్, వాసవి క్లబ్ అధ్యక్షులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అలాగే చంద్రయ్య, కిషన్, వినోద్, కంది మల్లేశ్, అశోక్, సతీష్, సంతోష్, మరెందరో భక్తులు హాజరయ్యారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

## కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

-హాజరుకానున్న మంత్రి వివేక్, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

**నర్సాపూర్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**
నర్సాపూర్‌లో శనివారం నిర్వహించనున్న కార్యక్రమంలో సాయికృష్ణ గార్డెన్‌లో మంత్రి వివేక్, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి చేతులమీదుగా కొల్చారం మండలానికి మంజూరైన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేయనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్‌చారి తెలిపారు. కొల్చారం మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన మొత్తం 61 మంది లబ్ధిదారులకు చెక్కులు మంజూరు అయ్యాయని ఆయన పేర్కొన్నారు. అర్హులైన లబ్ధిదారులు తప్పనిసరిగా హాజరై తమ చెక్కులను స్వీకరించాలని తహసీల్దార్ శ్రీనివాస్‌చారి విజ్ఞప్తి చేశారు.

# స్థాయి తెలుసుకుని మాట్లాడండి

-బిఆర్ఎస్ నేతలకు పుట్ట నర్సింగరావు హెచ్చరిక
-అభివృద్ధి పేరుతో మోసం
-బిఆర్ఎస్‌పై కాంగ్రెస్ ఫైర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

**గుమ్మడిదల, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**
గుమ్మడిదల మున్సిపాలిటీపరిధిలోని ఎంసిఆర్ఆర్ గార్డెన్‌లో మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు పుట్ట నర్సింగరావు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశం రాజకీయంగా వేడెక్కింది. ఈసందర్భంగా కాంగ్రెస్ నాయకులు బిఆర్ఎస్ నేతలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే కాంగ్రెస్ తగిన సమాధానం ఇస్తుందని స్పష్టంచేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సోలక్పల్లి శ్రీకాంత్ రెడ్డి బిఆర్ఎస్ నాయకులపై, ముఖ్యంగా మాజీ మంత్రి హరీష్‌రావును లక్ష్యంగా చేసుకొని ఘాటుగా స్పందించారు. గుమ్మడిదల మండలంలోని కానుకుంట రోడ్డు దుస్థితిని ప్రస్తావిస్తూ, పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు చేయాల్సిన పనులు చేయకుండా వదిలేసి, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని మేమే చేశామని చెప్పుకోవడం విచిత్రమని విమర్శించారు. గుంతల రోడ్ల వల్ల ప్రమాదాలు జరిగి అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయినా పట్టించుకోని వారు ఇప్పుడు క్రెడిట్ కోసం పరుగులు తీస్తున్నారు అంటూ మండిపడ్డారు. మున్సిపాలిటీ 13వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ మూడుచింతల నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ, పదేళ్ల పాలనలో చేసిన పనులు చెప్పలేక ఖాళీ మాటలతో ప్రజలను మభ్యపెడుతున్నారు. నిజంగా అభివృద్ధి చేసి ఉంటే ప్రజల ముందే చెప్పాలని సవాల్ విసిరారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు బిఆర్ఎస్‌కు గట్టిబుద్ధి చెబుతారని హెచ్చరించారు. సర్పంచుల ఫోరం అధ్యక్షుడు, కానుకుంట గ్రామసర్పంచి ఇప్ప పెంటారెడ్డి మాట్లాడుతూ, గత పదిసంవత్సరాలుగా సమస్యలను పట్టించుకోని బిఆర్ఎస్ ప్రభుత్వం, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరుచేసిన రోడ్డు పనులపై తమదే కృషి అని చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. వీరభద్రస్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ మద్ది ప్రతాపరెడ్డి మాట్లాడుతూ, అవినీతి, అహంకారం తప్ప బిఆర్ఎస్ పాలనలో అభివృద్ధి కనిపించలేదు. ఇప్పుడు అసత్య ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో మాజీ అధ్యక్షుడు మద్ది వీరారెడ్డి, మాజీ ఎంపిటిసి గోవర్ధన్‌గౌడ్, మాజీ సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డుసభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వార్డుసభ్యులకు ముగిసిన 2వ విడత శిక్షణ



శిక్షణపొందిన వార్డుసభ్యులకు ధృవీకరణపత్రాలు అందచేస్తున్న దృశ్యం

**సిర్గాపూర్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని 14 గ్రామ పంచాయతీల్లోని వార్డుసభ్యులకు 5రోజులపాటు నిర్వహించిన రెండవవిడత శిక్షణ కార్యక్రమాలు శుక్రవారంతో ముగిసాయి. శిక్షణపొందిన వార్డుసభ్యులకు అధికారులు ధృవీకరణపత్రాలు అందచేశారు. శిక్షణలో పొందిన మెళకువలతో గ్రామాభివృద్ధికి కృషిచేస్తామని వార్డుసభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ, ఎంపిఓ బ్రహ్మయ్య, శిక్షకులు వినయ్, అనిల్‌కుమార్, జనార్ధన్‌రెడ్డి, విజయ్‌కుమార్, రాజు, వార్డుసభ్యులు తదితరులు ఉన్నారు.

## రెడ్డిపల్లిలో ధాన్యం కొనుగోలుకేంద్రం



ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని ఆంజనేయులుగౌడ్ ప్రారంభిస్తున్న దృశ్యం

**నర్సాపూర్ రూరల్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**
నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచి పద్మావతి అశోక్‌గౌడ్, గౌరీశంకర్, పంచాయతీ కార్యదర్శి రమేష్, మహేశ్వరి, నర్సింలు, ఉపసర్పంచి, వార్డుసభ్యులు, ఐకెపి సభ్యులు, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్‌స్టేషన్‌లో సిపిఆర్ శిక్షణ

-మండల వైద్యాధికారి మధుకర్



పోలీస్ సిబ్బందికి శిక్షణ ఇస్తున్న దృశ్యం

**గుమ్మడిదల, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**
గుమ్మడిదల మండల పరిధిలోని పోలీస్ స్టేషన్‌లో సిబ్బందికి సిపిఆర్‌పై అవగాహన కల్పిస్తూ ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణను డాక్టర్ ఎస్.మధుకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అనుకోకుండా అపస్మారకస్థితిలోకి వెళ్లిన వ్యక్తులకు కృత్రిమశ్వాసను ఎలా అందించాలి, గుండెస్పందన నిలిచినప్పుడు తక్షణచర్యలు ఎలా చేపట్టాలి అనే అంశాలను ప్రాక్టికల్‌గా వివరించారు. సిపిఆర్ విధానంద్వారా ప్రాణాలను రక్షించగలమని, అత్యవసరపరిస్థితుల్లో సమయానికి స్పందించడం ఎంత ముఖ్యమో పోలీస్‌సిబ్బందికి తెలియజేశారు. సిపిఆర్ చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూడా వివరించారు. ఇలాంటి శిక్షణలు మరింత విస్తృతంగా నిర్వహిస్తే అనేకప్రాణాలను రక్షించవచ్చని డాక్టర్ మధుకర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై లక్ష్మణ్, లక్ష్మీకాంత్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది, హెచ్ఈఓ శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## పైతర గ్రామంలో సిద్ధమవుతున్న కళ్యాణమండపం

**కొల్చారం, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**
కొల్చారం మండలపరిధిలోని పైతరగ్రామంలో నిర్మాణంలో ఉన్న కళ్యాణ మండపం తుదిదశకు చేరుకుంది. గ్రామానికి చెందిన ఎల్లుగారి రామకృష్ణారెడ్డి స్వయంగా తన సొంతఖర్చులతో శ్రీభ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయం ముందు ఈకళ్యాణమండపాన్ని నిర్మించేందుకు ముందుకు రావడం గ్రామస్థుల ప్రశంసలు పొందుతోంది. ప్రస్తుతం నిర్మాణపనులు పూర్తికావడానికి చేరువలో ఉండగా, మే 3వ తేదీన ఈకళ్యాణమండపాన్ని ఘనంగా ప్రారంభించనున్నట్లు సమాచారం. గ్రామప్రజలకు ఉపయోగపడే విధంగా ఈమండపాన్ని అందుబాటులోకి తీసుకురావడం సంతోషకరమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. గ్రామప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని నిర్మితమవుతున్న ఈకళ్యాణ మండపం భవిష్యత్తులో వివిధ శుభకార్యాలకు కేంద్రంగా నిలుస్తుందని స్థానికులు భావిస్తున్నారు.

## నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలి

-ఎంపిడివో క్రాంతికుమార్



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపిడివో క్రాంతికుమార్

**పెద్దశంకరంపేట, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**
నర్సరీలో నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని ఎంపిడివో క్రాంతి కుమార్ సూచించారు. శుక్రవారం మండలపరిధిలోని బుజ్రాన్‌పల్లిగ్రామంలో నర్సరీని పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం ఉపాధి పనులను పరిశీలించి ఉపాధికూలీలకు వేసవికాలం దృష్ట్యా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈయన వెంట సర్పంచి జైపాల్‌గౌడ్, ఎపిఓ సంతోష్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి సంగమేశ్వర్‌లు ఉన్నారు.

## రైతుల అభ్యున్నతికే కాంగ్రెస్ ప్రభుత్వం

-సర్పంచుల ఫోరమ్ జిల్లా ఉపాధ్యక్షులు చంద్రం కృష్ణాగౌడ్



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారభించిన చంద్రం కృష్ణాగౌడ్

**కౌడిపల్లి, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**
రైతుల అభ్యున్నతికి పెద్దపీట వేసిందే కాంగ్రెస్ ప్రభుత్వమని సర్పంచుల ఫారమ్ జిల్లా ఉపాధ్యక్షులు, కౌడిపల్లి గ్రామ సర్పంచి చంద్రం కృష్ణాగౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన కౌడిపల్లి శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద పిఎసిఎస్ మహమ్మద్‌నగర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చంద్రం కృష్ణాగౌడ్ చేతులమీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో ఈయనతోపాటు కౌడిపల్లి గ్రామ ఉపసర్పంచి శ్వేతామల్లికార్జున్‌గౌడ్, మహమ్మద్‌నగర్ సొసైటీ సిఈవో దుర్గయ్యగౌడ్, ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కౌడ శ్రీనివాస్‌గుప్తా, కుర్మసంఘం మండలాధ్యక్షులు బోంబాయి లక్ష్మణ్‌యాదవ్, కౌడిపల్లి గౌడసంఘం అధ్యక్షులు చంద్రం కిషోర్‌గౌడ్, నాయకులు రాగుల భూమయ్య, పుండరీకంగౌడ్, చంద్రం వెంకటేశంగౌడ్, నాండ్ల వెంకటేశంగుప్తా, సత్యనారాయణగౌడ్, రమేశ్‌గౌడ్, తిరుమల్లేశ్, మంగలి ఆశోక్‌నాయి, వీరేశంగౌడ్, కొనుగోలు కేంద్ర నిర్వహకురాలు రూపలింగంగౌడ్, గ్రామ వార్డుసభ్యులు మక్బూల్, దేవేందర్‌కుమార్, రమేశ్, గౌడిచర్ల ప్రశాంత్, కారోబార్ యేల్లం, సొసైటీ సిబ్బంది సుధాకర్, ఇట్టబోయిన కిషన్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రాయిలాపూర్‌లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

**కౌడిపల్లి, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని రాయిలాపూర్ గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలతో శుక్రవారం నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జిల్లా సంక్షేమ అధికారి హేమభార్గవి, గ్రామసర్పంచి కుర్మ స్వప్నశేఖులు ముఖ్యఅతిథులుగా హాజరైనారు. పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా అసెస్మెంట్ కార్డు, సర్టిఫికెట్లను డిడబ్ల్యువో చేతులమీదుగా ప్రదానం చేయించారు. కార్యక్రమంలో వీరితోపాటు ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుజాత, గ్రామ ఉపసర్పంచి సంతు, వార్డుసభ్యులు, పంచాయతీకార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, కవిత, గర్భిణిలు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రసాయన ఎరువులు సమతుల్యంగా వాడాలి

**అల్లాదుర్గం, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**
రసాయన ఎరువులను రైతులు సమతుల్యంగా వాడాలని మండల వ్యవసాయ అధికారి రాజేష్ సూచించారు. మండల పరిధిలోని మాందాపూర్‌లోని గ్రామ పంచాయతీ వద్ద శుక్రవారం గ్రామ సర్పంచి కోర్పోల్ రమ్యభూమిరెడ్డి అధ్యక్షతన ఆయా పంటల్లో సమతుల్యంగా ఎరువుల యాజమాన్యం, బుకింగ్‌పైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈఓ అమృత్, రైతులు పాల్గొన్నారు.

# పిహెచ్‌సిలో డిఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీ

-మందుల నిల్వలు, రిజిస్టర్ల పరిశీలన
-ఓఆర్ఎస్, ఐవి ద్రవాల అందుబాటుపై దృష్టి



ధర్మారం పిహెచ్‌సిలో తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీరామ్

**రామాయంపేట, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**
మెదక్ జిల్లా ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్ రామాయంపేట మండలం ప్రగతిధర్మారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పిహెచ్‌సిలోని మందులదుకాణాన్ని పరిశీలించి, ముఖ్యంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఐవి ద్రవాల నిల్వలను సరిచూశారు. వడగాలుల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు అందించే వైద్యసేవలు సమర్థవంతంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. వడగాలుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేయవలసినవి, చేయకూడనివి, వడదెబ్బ తగిలినప్పుడు రోగులకు ద్రవాలను ఎలా అందించాలి అనే అంశాలపై సిబ్బందికి స్పష్టమైన సూచనలు ఇచ్చారు. అలాగే, పిహెచ్‌సిలో నిర్వహిస్తున్న అన్ని రిజిస్టర్లు, రికార్డులు, కొనసాగుతున్న ఆరోగ్య కార్యక్రమాల వివరాలను సమగ్రంగా ధృవీకరించారు. వైద్యసేవల నాణ్యతను మెరుగుపరచాలని, అవసరమైన సదుపాయాలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పిహెచ్‌సి డాక్టర్ వైశాలి, స్టాఫ్‌నర్స్, సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పి, ఎంపిహెచ్‌ఎ తదితర పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

# సొంత పార్టీ నేతలపై అసంతృప్తి..?



సమావేశంలో ఉద్యమకారుడు దర్గ శ్రీనివాస్ దృశ్యం

**గుమ్మడిదల, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**
తెలంగాణరాష్ట్ర సాధనకోసం పోరాడిన అసలైన ఉద్యమకారులను పక్కనబెట్టి, తరువాతి కాలంలో పార్టీలోకి చేరిన నాయకులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారనే ఆరోపణలు బిఆర్ఎస్‌పై తీవ్రంగా వినిపిస్తున్నాయి. ఉద్యమసమయంలో ప్రజల మధ్య నిలబడి పోరాడినవారిని విస్మరించడం, అధికారంలోకి వచ్చినతరువాత కొత్తగావచ్చిన నేతలకు పదవులు కట్టబెట్టడం ఉద్యమకారుల్లో తీవ్ర అసంతృప్తిని రేకెత్తిస్తోంది. పార్టీ ప్రెస్‌మీట్లు, సమావేశాలు, ముఖ్యకార్యక్రమాల్లో ఉద్యమకారులకు స్థానం లేకపోవడం గమనార్హం. ఈసందర్భంగా ఉద్యమకారుడు దర్గా శ్రీనివాస్ ఘాటుగా స్పందిస్తూ, ప్రాణాలను ఫణంగాపెట్టి, ఎన్నోకేసులు ఎదుర్కొని తెచ్చిన తెలంగాణను మరవద్దు. మేము రోడ్డెక్కి పోరాడిన రోజుల్లో మీరు కనిపించలేదు. ఇప్పుడు వేరేపార్టీలనుంచి వచ్చి బిఆర్ఎస్‌లో రాజకీయాలు చేయడం బాధాకరం అని మండిపడ్డారు. ఆ త్యాగాల ఫలితాన్ని ఇప్పుడు కొంతమంది తమ స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారు అని తీవ్రంగా విమర్శించారు. ప్రస్తుతం పార్టీలో డబ్బు, పదవులకే ప్రాధాన్యం పెరిగిందని, ఉద్యమస్ఫూర్తి కనుమరుగవుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇదేవిధమైన ధోరణి కొనసాగితే పార్టీ భవిష్యత్తుపై తీవ్రప్రభావం పడుతుందని ఆయన హెచ్చరించారు. ఇప్పటికైనా అసలైన ఉద్యమకారులకు గౌరవం, గుర్తింపు ఇవ్వాలని, వారిని నిర్ణయాత్మక స్థాయిలో భాగస్వాములను చేయాలని డిమాండ్ చేస్తున్నారు. లేదంటే ప్రజలే తగిన తీర్పు ఇస్తారని స్పష్టంచేస్తున్నారు.